

# ఫారిన్ రిటర్న్డ్... లేక స్వదేశీ ఉద్యోగ పర్వాలకు అతీతులు

లేళ్ళపల్లి వెంకటలక్ష్మీనారాయణ

మనవి:— నేను చాలా రోజుల క్రిందట నిరుద్యోగ, విరుద్యోగ, సురుద్యోగ, పర్వాలను (ఉద్యోగ విరమణతో సహా) ఆంధ్ర సచిత్ర వారపత్రికలో వ్రాశాను. అవి వ్రాసిన తర్వాత యీ స్వదేశీ వుద్యోగ పర్వాలకు అతీతులైనవారు అంటే విదేశాలు వెళ్లి స్వదేశం తిరిగొచ్చినవారి గురించి రాద్దామనే వుద్దేశ్యం వచ్చింది. నా మిత్రులు నాకత్యంత సన్నిహితులు అయిన డాక్టర్ కె. వి. ఎస్. శర్మగారు, (బ్రెయిన్ డ్రెయిన్ శర్మగారనీ, ఆస్ట్రేలియా శర్మగారనీ, మేం పిలుస్తూ వుంటాం.) 'బ్రెయిన్ డ్రెయిన్ అను అమెరికా మజిలీ కథలు' యీ పత్రికలోనే ప్రచురించేటప్పుడు యీ ఫారిన్ రిటర్న్డ్ కథలు రాయాలనే సంకల్పం మళ్లీ వచ్చింది. కానీ థీసిస్ పూర్తిచేయాలనే ఆదుర్దా ముందుకూ యీ కథలు వెనక్కూ వెళ్లినయ్.

ఇవి 'లైటర్ వెయిన్'లో రాసినా కొన్నిచోట్ల వాస్తవానికి దూరం మాత్రం కావు. విదేశాల్లో చదువు కొచ్చిన వారిని కించ పరచాలనే దురుద్దేశ్యం నాకు లేదు. కాని విదేశం వెళ్లటమే పరమావధిగా భావించి, వెళ్లటం వల్లనే యెంతో సాధించామనీ, సాధించాల్సింది యింకేమీ లేదనే వుద్దేశ్యాలతో ప్రవర్తించే వాళ్లకు అది సబబు కాదని చెప్పటమే యీ కథల లక్ష్యం. ఇలా ప్రవర్తించే వాళ్లు యింతవరకూ కొందరు, యీమధ్య మరింత మంది కనిపిస్తున్నారు. అలాగని అందరూ అలాంటి వాళ్లేనని చెప్పకూడదు. విదేశాలు వెళ్లటమేగాక, విజ్ఞానాన్ని ఆర్జించిన వారూ దాన్ని పెంపొందించిన వారు...యిలా ఎందరో మహానుభావులు: వాళ్లందరికూ వందనాలే. కానీ, వెళ్ళొచ్చినందుకే చెయ్యాలి తప్పుడు అంటే మనసొప్పదు మరి—

—డాక్టర్ లేళ్లపల్లి వెంకటలక్ష్మీనారాయణ శర్మ.

★ అహోగాడుగో...అల్లదుగో...
భారి దేశోద్ధారకుడు...భారి దేశో...'

'స్వాగతం...సుస్వాగతం...
దేశోద్ధరణకు పూనుకుని, దేశ
సేవకై తిరిగి వచ్చిన త్యాగశీలునకు,
స్వార్థరహితునకు స్వాగతం!
సుస్వాగతం!!'

ఈ పాట్నిప్పుడెవ్వరూ పాడటంలేదు; కనీసం రికార్డుల ద్వారా పాడించటంలేదు కూడాను. అయినా ఫారిన్ వెళ్ళటానికి యెన్నోపాట్లు పడి వెళ్లి తిరిగొస్తే యిలాంటి పాటలు రావటంలేదేమిటా, యిలా జరగటం లేదేమిటా అన్న బాధలోంచి పుట్టిన భావాలు ప్రొఫెసర్ భాం చేత యీ రాగాలు పలికిస్తున్నయ్. (అతగాడి పూర్తిపేరు పిపతం పద్మనాభం; అమెరికా వెళ్లిన మొదట్లో చివరక్షరం మాత్రం సౌకర్యార్థం ఉపయోగించారక్కడివాళ్లు! మొదట్లో 'భం' అంటూ పిలిచేవాళ్లు. రానురాను మాటలను సాగదీసి మాట్లాడందే విదేశీ ఉచ్చారణ రాదనే నమ్మకంతో పద్మనాభం యొక్క ఇండియన్ ఫ్రెండ్స్ 'భాం' అని పిలవటం మొదలెట్టారు. అమెరికన్సు మాత్రం 'భం' అనే పిలిచే వాళ్లు; కాకపోతే వకొక్కప్పుడు వత్తును తప్పించేవాళ్లు. ఇకముందు వీరిని 'భాం' అనిగాక పద్మనాభం అనే వ్యవహరిద్దాం. ఇండియన్ ప(వి)న్నేశారు కాబట్టి మనం యిలా సంభోధించినా వారు కోప్పడరనే ఆశాభావంతో యీపని చెయ్యొచ్చు) ప్రొఫెసర్ పద్మనాభం అమెరికాలోని ఒక యూనివర్సిటీలో ఒక డాక్టరేటు పుచ్చుకుని మరోయేడాది ఆ యూనివర్సిటీలోనే టీచ్ చేసి తిరిగి యీ దేశానికి సేవచేయాలనే వుద్దేశ్యంతో వచ్చేశారు. ఇప్పుడిలా రావటానికి ఎక్కువ తొందరపై కారణాలున్నయ్; కానీ పద్మనాభంగారు ఒకేఒక కారణం తన్ని దేశానికి తీసుకొచ్చిందంటారు. అదేమిటంటే—

'మన దేశంలోని బ్రెయిన్ డ్రెయినయిపోతోంది. ఇలా జరగటానికి వీల్లేదు. ఇలా జరిగితే దేశప్రగతికే గొడ్డలిపెట్టు; అందుకే నీ దేశానికి నీ శక్తిని (అంటే ఫారిన్ రిటర్న్డ్ శక్తిని) పణంగాపెట్టు; నీ శక్తికి వెలకట్టకు; వెలకట్టి యెల్లకాలం విదేశాల్లోనే వుండిపోకు; నీ దేశానికిరా...వచ్చిపోకు...నీ మేధాసంపత్తి నందరికీ పంచిపెట్టు.' ఈ దృక్పథమే తనిండియాకు రావటానికి కారణం అంటారు పద్మనాభంగారు. ఈ నాలుగుముక్కల్నీ బొంబాయిలో ప్లేన్ దిగిన వెంటనే విలేఖర్లకు చెప్పాలని యెంతో వుత్సాహ పడ్డారు పద్మనాభంగారు. ప్లేన్‌దిగి అక్కడెదురుగా వున్న కుర్రాడు చేతిలోని కెమెరాను మెళ్లో తగిలించుకుంటుంటే పద్మనాభంగారు నేలమీది దుమ్ము చేతిలోకి తీసుకున్నారు. కెమెరాక్లిక్ మన్లేదు; ఆ కుర్రాడు అనాసక్తిగా పద్మనాభంనంక చూశాడు. కెమెరా క్లిక్ చెయ్యమన్నట్లు నవ్వుతూ తలాడిస్తూ చూశారు పద్మనాభంగారు. కుర్రాడు నవ్వాడుగానీ కెమెరాని క్లిక్ మనిపించలేదు. ఇక్కడ ఫోటోలు తియ్యకూడదేమోననని సరిపుచ్చుకున్నారు పద్మనాభంగారు; పుచ్చుకున్న మట్టి నొదిలేశారు.

'విలేఖర్లు రాలేదా?' అనడిగారు ప్రక్కగా వున్న ఆఫీసులాంటిగదిలో వున్నతన్ని. పద్మనాభంగారి అవస్థంతా గమనిస్తున్న ఎయిర్‌హోస్టెస్—

'లేదండీ...విలేఖరులందరూ బంగ్లాదేశ్ వ్యవహారాల్లో మునిగిపోయారు. ఎవ్వరూ లేని సమయంలో, రాని సమయంలో, కాని సమయంలో మీరిక్కడ తేలారు; పాపం!' అంది.


'ఇంతే...ఇండియాలో కర్టెసీలేదు. మేం అక్కడున్నంతకాలం 'రండి ... రండి' అని చంపుకుతింటారు. వచ్చాక సంగతే పట్టించుకోరు. 'ఏరోడ్రోం'కు కూడా రారు' అంటూ విసుక్కున్నారు పద్మనాభంగారు.

'ఇలాగయితే మళ్లీ తిరిగి అమెరికా

వెళ్ళిపోవాల్సిందే' అని కోప్పడి భయపెట్టారు కూడాను. ఇన్నిచేసి ఎయిర్ హోస్టు బయటకు వచ్చేశారు.

పద్మనాభం ఫారిన్ వెళ్ళకముందు గాలి తీస్తే పడిపోయేటట్లుండేవాడు; యిప్పుడు గాలినిండిన బంతిలా నున్నగా గుండ్రంగా తయారయ్యాడు. పూర్వం పద్మనాభం మెడ అందరికీ కనిపించేది; యిప్పుడు మెడ మాయమయ్యింది; భుజాలకు బుగ్గలకూ మధ్య యెడమే లేదిప్పుడు. ఫారిన్ వెళ్ళకముందు నడిచేటప్పుడు, సంభాషణ పడిపేటప్పుడు భుజాల అవసరం కనిపించలేదు. ఇప్పుడు మాట మాటకూ, చీటికీ మాటికీ భుజాలెగరేస్తున్నాడు. మాట్లాడనప్పుడు, మాట లేనప్పుడూ మరీ యెగరేస్తున్నాడు. భుజాలెగరెయ్యటంలో వోపద్ధతుంది. ప్రతివాక్యం (లేదా మాట) మొదలెట్టేటప్పుడు భుజాలు పైకిలేపటం మొదలెడ్తాడు. వాక్యం పూర్తయ్యేసరికి రెండు భుజాలు రెండు చెవుల్నీ ముద్దెట్టుకుని సినిమాల్లో నాయికి తనను నాయకుడు మొదటిసారిగా కావలించుకున్న తర్వాత కరెంటు షాకు తిన్నట్టు పరిగెత్తిన వేగంకంటే సగం వేగంతో రెండు భుజాలు యథాస్థానాని కొస్తాయ్. తోలుబొమ్మలాటల్లో కొంత సేపటివరకూ అవసరంలేని బొమ్మల్ని క్రిందికి దించకుండా వోమూల గుచ్చుతారు. తెరమీద నిగతా బొమ్మలు కదులుతున్నప్పుడు కదలికకు ఈ బొమ్మల చేతులూ కాళ్ళూ వూగుతూ వుంటయ్; సరిగ్గా యిలాగే చేతులూపుతూ వుంటాడు పద్మనాభం మాట్లాడేటప్పుడు. ఇలా భుజాలెగరెయ్యటంలో యెంతో అర్థం వుంది. ఇండియాలో చదువుకుని, యిండియాలో వుద్యోగాల్జేసేవాళ్ళు పూసరోమంటూ ఏమీ శక్తి లేనట్లుంటారు. బాధ్యతల్ని స్వీకరించటానికి శక్తిలేనట్టు, యేదో భుక్తికోసం అన్నట్టు వుద్యోగాల్జేస్తూ వుంటారు. అందుకని వాళ్ళ భుజస్కంధాలమీద కొండంతటి బరువు బాధ్యతలు పెట్టలేం; పొరపాటున కూడా పెట్టకూడదు; చాలా తప్పు; దేశానికే ముప్పు కాని ఫారిన్‌రిటర్న్డ్ భుజాలు యెంతబరువైనా మొయ్యగలవ్; అందుకని ఆ భుజాలమీద దేశోద్ధరణలాంటి బరువులు పడెయ్యవచ్చని భావించుతూ విదేశాలు తిరిగొచ్చిన వాళ్ళు భుజాలెగరేస్తారు.

## మొదటి కథ: ఫారిన్‌రిటర్న్డ్ ప్రవేశం



భుజాలెగరెయ్యటంతో బాటుగాకుండా, యెగరేస్తూనే పద్మనాభం మరోపన్జేస్తాడు. కళ్ళు పెద్దవిజేసి, కనుబొమలు పైకెత్తి తల ప్రక్కకు వేలాడేస్తాడు. భుజాలు పైకెగరవేసి కిందికి దించటం, కళ్ళు పెద్దవిజేసి కనుబొమలు పైకెత్తటం, తలప్రక్కకు వేలాడెయ్యటం — యీ మూడుపనులు ఒకేక్షణంలో చెయ్యగలగటం పద్మనాభం ఫారిన్ వెళ్ళి నేర్చుకున్న మొదటి విద్య. దాన్నే బాగా సాధనజేశాడు, కొత్తలో నేర్చుకోవటం కష్టమనిపించి యిది బోధనా విషయంగా యే యూనివర్శిటీలో నన్నా వుండేమోనని వాకబు జేశాడు. ఓ డజను యూనివర్శిటీలు యీ విషయమై తిరిగాడు. అప్పటికా విషయం నేర్చుకున్నాడు. అందుకని అన్వేషణ మానేశాడు. అందుకే యిప్పటికీ 'నేనమెరికాలో పది పన్నెండు యూనివర్శిటీల్లో 'స్టడీ' చేశానంటాడు పద్మనాభం. 'ఏం చదివేశావ్'ని యిక్కడెవ్వరూ అడగరు కదా.!

పద్మనాభం నేర్చుకున్న మరో విషయం 'య్యా' అనటం. ఇండియాలో వుండిపోయినవాళ్ళకు 'కాన్ఫిడెన్స్'పోయి వాగట్లాడితే 'అయ్యా' అంటారు. ఫారిన్ వెళ్ళి రావటంతో స్వశక్తిమీద నమ్మకంయేర్పడి 'య్యా' అంటారు. 'య్యా' అన్నది 'యస్'కు అపభ్రంశం (చదువరికి తెలియదని మనవి వెయ్యటంలేదని మనవి.) ఇలాంటి అపభ్రంశాలు బోల్డచ్చు పద్మనాభానికి.

ఇక వేషానికొస్తే పద్మనాభం వుపయోగించే భాషకూ, ప్రదర్శించే భావాలకూ ఆదేం తీసిపోదు. మగచెంపలు చెవిసగం దాపుల వరకే ఆపకుండా చెంపలో సగభాగంవరకూ వుంచుతాడు. జుట్టు దువ్వటం అన్న విషయం యెప్పుడోనే మరిచిపోయాడు. తైలసంస్కారాని కతగాడి జుట్టెప్పుడోనే తిలోదకాలిచ్చింది. పద్మనాభం యిండియా కొచ్చిన క్రొత్తలో అతగాడు బజారుమీద అతగాడి స్నేహితులకు కనబడితే వాళ్ళత

గాడు పద్మనాభం అని కనిబెడితే 'ఎక్క డికి? సెలూన్‌కా?' అనడిగేవాళ్లు.

'అబ్బే!...అలా మా చుట్టాలింటికి బయల్దేరాను. అయినా యిప్పుడు సెలూన్ కెందుకు? క్రిందటి సమ్మర్‌లో కెనడా వెళ్లాను. టొరెంటోలో వక సెలూన్ మంచిదని నా ఫ్రెండ్ చెబితే అక్కడ చేయించాను. ఎలా వుంది కెనడా హెయిర్ కటింగ్?' అనేవాడు.

పద్మనాభానికి అతగాడి వంటిమీదున్న ప్రతి వస్తువూ—బూటు దగ్గర్నుంచి (దాంట్లోని మేజోడు మినహాయించకుండా) అతగాడి జేబులో వన్న గుడ్డ వరకూ—యెక్కడ కొన్నాడో గుర్తే. అదీ అతగాడిలోని విశేషం. వాటిధర కూడా చెబుతాడు; అదీ అతగాడి ప్రజ్ఞ. ఇండియాలో చదువుకుని యిక్కడే వుద్యోగాల్చేసే వాళ్ళూ వున్నారు – యెందుకు? కుట్టించుకున్న సూటుధర, కొన్న స్వెటు ధరలు కూడా. గుర్తుంచుకోలేరు. వీరికి జ్ఞాపకశక్తి, మేధాశక్తి లేవన్నదాని కిది నిదర్శనం కాదూ? మరి పద్మనాభం విషయంలో అదేం కాదే! మీ రతగాణ్ణి అతగాడి చొక్కా ధరెంతో అడగండి; తొందర పడకండి... మీరెందుకూ అడగటం? అతగాడే చెబుతాడు...వినండి.

'ఇదెంత?!...న్యూయార్కులో నాలుగు డాలర్ల డెభ్భైఅయిదు సెంట్లకు కొన్నాను

# ఫారిన్...

...అక్కడ చాలా బావుంటయ్' అంటూ దాని ధర సెంట్లతో సహా, దానితోబాటు కొన్న సెంటుబుడ్డి సంగతితో సహా చెబుతాడు.

పద్మనాభం పాంటుకూ, అతగాడికాలికీ అవినాభావ సంబంధం వుంది. అవి రెండూ వకట్నొంటుకుని మరొకటుంటయ్. దర్జీగాడు పద్మనాభం కాళ్ళచుట్టూ గుడ్డను చుట్టి అతగాణ్ణి మిషన్‌మీద పడుకోబెట్టి పాంటు కుట్టేశాడా అన్నట్టు చాలా 'స్ట్రైట్'గా వుంటుంది. ఆ పాంటుకు పదంగుళాల వెడల్పు బెల్సు. పద్మనాభం యిండియా వచ్చేముందే రీసెంట్ ఫ్యాషన్ పాంటులు 'బెల్‌బాటం' పాంటులమీదికి దృష్టి మళ్లింది. కానీ యిప్పుడు వేసుకొచ్చింది స్ట్రైట్‌పాంటే. పద్మనాభం వో నాలుగు 'బెల్‌బాటం' పాంట్లుకొని దగ్గిర పెట్టుకున్నాడు; అవిప్పుడు పెట్టెలో పెట్టుకొచ్చాడు.


ఇంత ధైర్యంగా యిక్కడకొచ్చి మాట్లాడగల్గుతున్నాడు గానీ పద్మనాభం వ్యవహారం అమెరికాలో చాలా దయనీయంగా వుండేది. పిహెచ్. డి. తీసుకున్నాక ఆ యూనివర్సిటీలోనే ఒక మంచి పోస్టొస్తుందేమోనని చూశాడు. కానీ యేదో చిన్న టీచింగ్ పోస్టు యేడాదిచ్చి మానేశారు

ఏం చేద్దామా అని ఆలోచిస్తుంటే ఇండియాలోని ఒక ఇన్‌స్టిట్యూట్‌వాళ్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు అడ్వర్టయిజ్ చేశారు.

ఇండియానుండి అప్లయ్ జేసేవాళ్లని పదో పదిహేనో కాపీలు నింపి యేడున్నర రూపాయల పోస్టలార్డర్తో సహా పంపమన్నారు. కొందర్ని రెండురూపాయల పోస్టలార్డరు మాత్రం పంపమన్నారు. పోస్టలార్డర్లేని అప్లికేషన్ స్వీకరింపబడదన్నారు. అప్లికేషన్ లేని పోస్టలార్డరు స్వీకరింపబడవచ్చునన్నారు. ఒకసారి పంపిన డబ్బు యెంతమాత్రం త్రిప్పిపంపబడదన్నారు. (రెండుసార్లు డబ్బుపంపితే యేం చేస్తారో చెప్పలేదు.) ముందు డబ్బు సంగతి గోవిందా అన్నారు! తర్వాత వుద్యోగం సంగతి కూడా నంతే నన్నారు. ఇండియా నుంచి పంపే భక్తులు 'గోవిందా' అనుకుంటూనే అప్లికేషన్లు పోస్టాఫీసులో యిచ్చారు. కొన్ని నవ్వులు మరికొన్ని పువ్వులూ సిద్ధం జేసుకున్నారు. ఇండియాలో వున్నవాళ్ళకిన్ని నిబంధనలు పెట్టారు. ఫారిన్‌నుంచి దరఖాస్తులు పంపదలుచుకున్నవారుమాత్రం తెల్లకాగితం మీద రాసి పంపగలరని విన్నవించుకున్నారు. డబ్బు పంపక్కర్లేదన్నారు. మధ్యలో చేసే యింక్వయరీలకు సమాధానాలివ్వబడవ్ అని తెగేసి చెప్పారు. చేసేదేదో ముందే చెయ్యాలి కాబోల్నురా భగవంతుడా అనుకున్నారు అప్లయ్ చెయ్యదల్చుకున్న వాళ్లు.

ఈ ప్రకటన చేసిన ఇన్‌స్టిట్యూట్‌ను నడిపించే ఆయన అప్లయ్ జేసిన ఫారిన్ అభ్యర్థులలోంచి యెన్నుకునేందుగ్గాను యేడాదికోసారి భూప్రదక్షిణం చేస్తూ వుంటాడు. ఆ సంగతాయన వుత్తరోత్తరాయే పోస్టుకన్నా అప్లయ్ చేసేటప్పుడు రాసుకుంటాడు. అది వేరే విషయం. కానీ యీ సంవత్సరం ఆయన మరేదో గొడవలో పడి భూప్రదక్షిణం వాయిదా వేశాడు. ఇలా తెల్లకాగితం మీద రాసి పంపిన విదేశాల్లోని మన దేశీయులకీ సంవత్సరం నేరుగా ఆర్డరు పంపాలని నిశ్చయించాడు.

ఈ ప్రకటన చూసి పద్మనాభం అప్లయ్ జేశాడు. అప్లయ్ జేసేటప్పుడు



అతగాడి మిత్రులు ప్రొఫెసర్ పోస్టుకి దరఖాస్తు రాసి పంపి రానని బెదిరించమన్నారు. ప్రొఫెసర్ పోస్టులో సీనియర్ ప్రొఫెసర్ జీతంకోసం బేరమాడమన్నారు. తనిండియాలో దిగంగానే మొదటికాలు విమానాశ్రయంలోనూ రెండోకాలు తనకు ఇన్స్టిట్యూటిచ్చే క్వార్టర్లోనూ పెట్టాలనే వుద్దేశ్యంలో వున్నట్టు తెలియజెయ్యమన్నారు. ఈ కోరికలన్నీ కోర్తుండగా హిరణ్యాక్షు డొచ్చాడు పద్మనాభం దగ్గరకు. వచ్చి—

'అయ్యా! మీరు పంపే దరఖాస్తు కాపీ నొకటిప్పించండి నాకు. నామీ దింతవరకూ నో అపవాదుంది. హిరణ్యాక్షుడి కోరికలనే సామెత లేవదీసి ఆ అపవాదొకటి నామీద వేశారు. నాకీ అప్రదిష్ట తొలగించినందు కెంతో ఋణపడ్తాను. ఓ కాపీ దయచేసి యిప్పించండి' అన్నాడు.

'అబ్బే...మా కోరికల లిస్టింకా అవ్వలేదు. తర్వాత కనిపించు' అని పద్మనాభం స్నేహితులు హిరణ్యాక్షుణ్ణి పంపేశారు.

స్నేహితుల్చెప్పిన కోరికలన్నీ రాద్దామనే అనుకున్నాడు పద్మనాభం. కానీ యెందుకో భయపడ్డాడు. తను ప్రస్తుతం వుంటున్న వుద్యోగానికింకో రెండునెల్లో రిద్యాపన చెప్పేస్తారని గుర్తుకొచ్చి ప్రొఫెసర్ పోస్టడక్కుండా అసిస్టెంటు ప్రొఫెసర్ స్కేల్లో పదకొండొంద లివ్వమన్నాడు. మిత్రులు తిట్టిపోశారు; జుట్టు కట్టి అతగాణ్ణి కొట్టినంత పన్జేశారు. అప్లికేషన్ను పోస్టు చెయ్యనివ్వమన్నారు, విదేశాల్లో వుండే ఇండియన్సుకు ప్రతిష్ట తీసుకురాకపోయినా అప్రదిష్ట మాత్రం తెస్తున్నారు. ఫారిన్ రిటర్న్డ వాళ్ళమీద 'పూర్ నాపీనియన్' కలగచెయ్యొద్దని హెచ్చరిక పెట్టారు.

'నేను ప్రొఫెసర్ పోస్టడిగితే యివ్వకుండా నా దరఖాస్తుని అవతల పారేస్తే నాకు మరో వుద్యోగం చూసి పెట్టారా యిక్కడ? పోని నేనే చూసుకుంటాను; మరో వుద్యోగం దొరికేదాకా భోజనం పెడ్తారా?' అన్నాడు పద్మనాభం.

'మొత్తానికి గట్టివాడివే' అని మిత్రులు మెత్తబడ్డారు. 'నువ్వు చెప్పిన రెండూ పెట్టూ కష్టమే...అప్లయ్ చెయ్ పోవ్' అన్నారు.

# బ్రైట్స్ డిసీజ్

## పి. రమేష్ నారాయణ

వంశపారంపర్య లక్షణాలను వర్ణించే ఆనువంశిక విజ్ఞానానికి మూల పురుషుడు జన్యుశాస్త్ర పితామహుడు అగు మెండెల్ మహాశయుడు 1874 వ సంవత్సరంలో బాధాకరమైన మరణం అనుభవించటానికి కారణం 'బ్రైట్స్ డిసీజ్' అని చెప్పబడుతూంది. శాస్త్రీయంగా ఈ వ్యాధిని 'గ్లామరూలోనెఫ్రిటిస్' అంటూ వ్యవహరిస్తారు. మూత్ర పిండాలకు సంబంధించిన ఈ రోగం బ్లడ్‌ప్రెషర్, బలహీనత, రాత్రిళ్ళు చాలా మార్లు మూత్రం విసర్జించుట లాంటి లక్షణాలను కనబరుస్తుంది. దీని తొలి దశల్లో జ్వర లక్షణాలతో పాటు కళ్ళు వుబ్బటం, వీపునొప్పి, చెవిపోటు, కాళ్ళ వాపులు వ్యక్తమవుతాయి.

ఈ రోగులు విసర్జించే మూత్రం ద్వారా రక్తము, ఆల్బుమిన్స్ అన్న ప్రోటీను అంశాలు అధికంగా నష్టపోతూంటారని నిపుణుల పరీక్షలు వెల్లడిస్తున్నాయి. కొలంబియా యూనివర్శిటీ కాలేజీ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్‌కు చెందిన డాక్టర్ డికిన్సన్ రిచర్డ్స్' అభిప్రాయంప్రకారం స్కార్ టిష్యూ ఈ రోగానికి దారి తీయొచ్చట.

ఈ వ్యాధికి ఖచ్చితమయిన వైద్య నివారణంటూ లేదని అమెరికన్ మెడికల్ అసోసియేషన్ వైద్య శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఈ రోగులు నాటువైద్యం చికిత్సలు పొందకుండా నిపుణుడయిన వైద్యుడినే సంప్రదించాలి. 1950 వ సంవత్సరంలో యునైటెడ్‌స్టేట్స్ నందు స్థాపించబడ్డ 'నేషనల్ కిడ్నీ డిసీజ్ ఫౌండేషన్' అన్న జాతీయవైద్య సంస్థ మూత్రపిండాలకు సంబంధించిన ఇలాంటి వ్యాధుల నివారణకు ప్రముఖంగా కృషి చేస్తున్నది. అమెరికాలో ప్రతి వందా పాతిక అమెరికన్లకు ఒక వ్యక్తి ఈ వ్యాధితో బాధపడుతున్నాడని ఆ సంస్థకు చెందిన పరిశోధకులు ఒక సర్వేలో వెల్లడించారు.

నవీన పరిశోధనలు రూపొందించిన కృత్రిమాంగాల్లో మూత్రపిండాలను మార్పిడి ప్రయోగాల ద్వారా ఈ రోగ నివారణకు మార్చుకోవచ్చు గాని ఎక్కువ డబ్బు ఖర్చుతో కూడిన ఈ చికిత్స సామాన్యుడి కందుబాటులో లేని అంశమే. ఒక్కోసారి ఇలాంటి మార్పిడులు విఫలమయితే రోగి ప్రాణానికే ముప్పు రావచ్చు.

మూత్రపిండాలకు సంబంధించిన ఈ వ్యాధి గల వ్యక్తులు ఉప్పు తక్కువగవుండే ఆహారాన్ని, ప్రోటీను ప్రమాణాలు తక్కువగ వుండే పదార్థాలను, మినరల్ వాటర్‌ను పుచ్చుకోవాలి. ఆహారంలో ముఖ్యంగా కార్బోహైడ్రేటు పదార్థాలు అధికంగా తీసుకొంటూ, ప్రతి దినమూ కనీసం 100—200 గ్రాములు గ్లూకోజులాంటి చక్కెర పదార్థాలు విధిగ గ్రహించాలి.

ఈ రోగులు ఎక్కువ కాలం పడకపై విశ్రాంతిని పొందుతూండాలి. వ్యాధి లక్షణాలు తగ్గుముఖం పట్టినా మూత్రంలోని ఆల్బుమిన్ శతాన్ని గమనించటానికి తరచూ మెడికల్ చెకప్ చేయించుకోవాలి. శస్త్ర చికిత్సలు, దంత వైద్యము గావించుకొనే పరిస్థితుల్లో, రోగి తనకు నెఫ్రిటిస్ వుండేదన్న విషయం విధిగ వైద్యులకు తెల్పటం ద్వారా 'ఇన్‌ఫెక్షన్' నివారించుకో గలుగుతాడు.

ఈ అంశానికి సంబంధించిన మరో ముఖ్యవిషయం— ఇతర మూత్రపిండాల వ్యాధులగు నెఫ్రోసిస్, సిస్టైసిస్, పైలోనెఫ్రిటిస్ లాంటివి 'బ్రైట్స్ డిసీజ్'కు చాల సన్నిహితంగా రూపాంతరంచెందిన వ్యాధులని తేలటమే. ఏది ఏమయినా సరయిన వైద్య సలహా, చికిత్సా అంటూ సకాలంలో లేకపోతే వ్యక్తులకు ఖచ్చితంగా ప్రాణాపాయం కలిగిస్తుందీ వ్యాధి బృందం. ఇంకా ప్రారంభ స్థాయిలోనే వున్న ఈ అంశానికి సంబంధించిన వైద్య పరిశోధనలు త్వరలోనే సత్ఫలితాల నిస్తాయని ఆశించటం కన్నా ఇప్పట్లో చేయగలిగిందేమీ లేదు.

'అదీ అట్లా రండి దారికి... అయినా లాగా పోస్టయినా వస్తుందో లేదో' అన్నాడు విచారంగా పద్మనాభం.

'అదిగో... ఆ మాటంటే మాత్రం ఒప్పుకోం' అన్నారు మిత్రులు.

'ఏమిటంత గ్యారంటీ? ఇట్లా డాక్టరేటున్నవాళ్లా, అనుభవం వున్నవాళ్లా అక్కర్లేరా' అన్నాడు పద్మనాభం.

మిత్రుల్లోని ఒక జ్ఞాని ముందుకొచ్చి చెప్పటం మొదలెట్టాడు.

'నువ్వు వెళ్లేది యిండియాకు. అక్కడ మనుష్యులెలాంటివాళ్లు?' అన్నాడు జ్ఞాని.

'నల్లవాళ్లు' అన్నాడు పద్మనాభం జోక్ చేస్తున్నట్టు.

'ఒరేయ్! ఇక్కడొచ్చిన రంగుచూసి పొంగిపోకు. ఈ తెలుపెంతో కాలం నీకుండదులే. మును పెంతో యిండియా కెళ్లాక యికముందూ అంతే... మిడిసిపడకు' అని.

'అట్లా మాట్లాడకు... కళ్లు పోతయ్... నీ రంగు మాసిపోయ్...రంగు మాత్రం పోనీకు' అని చెప్పాడి, సలహాయిచ్చి కొనసాగించాడు జ్ఞాని.

'ఇండియాలోని మనుష్యులకు మొదటి నుంచీ అంటే చరిత్ర మొదలుపెట్టిన దగ్గర్నుంచీ కొన్ని లక్షణాలు వెంటబడొస్తున్నట్టు మనకంట బడుతుంది యే

## ఫారిన్...

చరిత్ర పుస్తకం తెరిచినా. అందులో మొదటిది! మనవాళ్లకు పొరుగింటి పుల్లకూర రుచి. దాన్ని మెచ్చుకోవటం, పుచ్చుకోవటం ఆచారం. అలా చెయ్యకపోవటం అపచారంగా భావిస్తారు. దీనికితోడు మన శాస్త్రాలు 'పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదు' అని ఘోషిస్తున్నాయ్. అందుకే యెక్కడో వున్న చెట్టునే పోషిస్తాం మనం. బయటున్నదే మనం కతుకుతాం. అలాగే బతుకుతాం.'


'ఇక రెండో సంగతి. మొగుడికి ఇంట్లో వున్న పెళ్లాం అందంగా కనిపించటం జరగని విషయం. అందరికీ తెలిసిందే. (ఇది యిండియన్స్ విషయంలో మరీను. ఫారిన్‌లో అయితే తన పెళ్లాంగాని ఆడదానికి చూపించినంత పొగడ్త, గౌరవం పెళ్లాని క్కూడా చూపిస్తాడు మగడు. 'యూ ఆర్ బ్యూటిఫుల్ టుడే, డార్లింగ్!' అంటారు. ఈ విధంగా పెళ్లయిన రోజు నుంచీ [illegible] పుచ్చుకునేరోజు వరకూ యెంత మోజుతో, అంతే [illegible] జోరీగలాగ అంటూనే వుంటారు. వాళకి బోరు కొట్టదు. మరి యిండియన్ మొగుళ్లిట్లా అనరే, పెళ్లయిన మొదటి సంవత్సరంలో తప్ప. (యిండియన్ పెళ్లాం మాదిరే యిండియన్ పి.హెచ్.డి. క్కూడా వచ్చిన మొదటి సంవత్సరాంతం వరకే. గౌరవం! మరి నీడిగ్రీకో? పరదేశంలో వచ్చింది. పారిజాతానికున్నంత విలువుంది. అది నిత్యనూతన సౌందర్యవతి. నీడిగ్రీ గురించి అదొచ్చిన చోటుగురించి నువ్వు చచ్చేదాకా చెప్పుకోవచ్చు. ఇండియాలో నీడిగ్రీని కళ్లకద్దుకుని (కళ్లద్దాల్లేనివాళ్లు కూడా) నిన్ను నెత్తినెక్కించుకుంటారు సెలెక్షన్ బోర్డువాళ్లు. తర్వాత నిన్నే పదిమంది నెత్తిమీద పెడతారు. వాళందరూ నీకు బ్రహ్మరథం పడతారు. కానీ వెనకాలేడుస్తారు నిన్నుజూసి (ఇదిగో...యిది రాసేవాడలాంటివాడని నా అనుమానం... సరే యిప్పుడేం అనకు...ఏం రాస్తాడో చూద్దాం. తర్వాత ఘాటుగా వుత్తరాలు రాద్దాం... అయినా యెందుకూ?... ఇండియా వెళ్లి యితగాడి అడ్రసు కనుక్కో.. ఫారిన్ పంపించి వో ముద్దులొచ్చే యేర్పాటు చేద్దాం. యింకిలాంటివి రాయడు.) వాళ్ల కళ్లనీళ్లు తుడవాలని కూర్చోకు. వాళంతే...దేశం కదల్రు. అజ్ఞానాన్ని వదల్రు. ఇండియాలోనే పైపోస్టులక్కని పెట్టు కూర్చుంటారు. ఏమీ కనిపెట్టరు. ఒక్కటనీ ముట్టరు...వాళ్లంతే... వాళ్ల సంగతొదిలెయ్...ఇందువల్ల నీకీ పోస్టు రావటం ఖాయం. అదీ యిప్పటి యిండియాలోని న్యాయం. వాళ్లకిప్పుడు తప్పకుండా కావాలి నీ సాయం.' అని భరోసా యిచ్చారు.

'అలాంటప్పుడు నీకెందుకు భయం' అని ధైర్యం చెప్పారు మిత్రులు.

'కావాలంటే బెట్' అన్నారు మళ్లీ.

మిత్రులవాక్కు నిజమయ్యింది.

తర్వాత రెండు నెలలకు 'ఇండియాలో జరిగిన యింటర్వ్యూలో పది పదిహేను కాపీలు నింపి పంపిన అభ్యర్థులందర్నీ (ఒదే డిపార్టుమెంటులో వుంటూ నలుగురైదుగురు డాక్టరేట్లు యిప్పించినవారితో సహా) ముక్కుతూ, మూలుగుతూ 'ఇంటర్వ్యూ చేశాం' అని అనిపించేసి వాళ్లని పంపేసి ఆర్డరు మాత్రం అమెరికాలోని పద్మనాభానికి పంపారు [illegible]గా పదేళ్లనుంచీ లెక్చరర్లుగా వుంటూ, [illegible] నాడు డాక్టరేట్లు పుచ్చుకుని నలుగురైదుగురు స్టూడెంట్లకు డాక్టరేట్లు తెప్పించిన ముగ్గురి నెత్తిమీదొచ్చి కూర్చునందుకు గ్గాను యిండియాకు వి(వ)చ్చేశాడు పద్మనాభం. (ఇంకా వుంది)





# ఫారిన్ రిటర్న్డు లేక స్వదేశీ ఉద్యోగ పర్వాలకు అతీతులు

బెజ్జపల్లి వెంకటలక్ష్మినారాయణ

## రెండవ కథ



## ఫారిన్ రిటర్న్డు స్వదేశీ నిరుద్యోగి

ఫారిన్ రిటర్న్డు పద్మనాభం బ్రీఫ్ కేసు (జేమ్స్‌బాండ్ టైప్) చేత్తో పట్టుకుని డిపార్ట్‌మెంటువేపు బయల్దేరారు. అతగాడి డిపార్ట్‌మెంట్‌లో చేరి రెండ్రోజులయ్యింది. ఇవ్వాళ మూడోరోజు. మొదట్రోజు డిపార్ట్‌మెంటంతా 'గ్లాచ్యూవిూచ్యూ', 'ఛ్యూ' అంటూ తిరిగాడు. రెండోరోజున తను తిరిగిన ప్రదేశాలగురించి అడిగినవాడికీ అడగనివాడికీ...అందరికీ చెప్పాడు. అడగనివాడికి చెప్పేందుకో పద్ధతుంది.

'శాన్‌ఫ్రాన్సిస్కోలో యిట్లావుంటుంది. బట్ యిన్ పారిస్ యిటీజ్ సంథింగ్ ఎంటైర్లీ డిఫరెంట్' అంటాడు.

'నే జూశా గా... నే వెళ్లినప్పుడేమయ్యిందంటే...' అంటూ మొదలెడ్తాడు.

చేరిన్రోజునుంచి మూడోరోజైన యీ రోజున విదేశాల్లో తీసిన ఫోటోలు, అక్కణ్నుంచితెచ్చిన మరికొన్ని బొమ్మల పుస్తకాలు (రెండోవి కొద్దిమందికే యిస్తాడు), తను దిగిన యింటివాళ్ళతో తనుదిగిన ఫోటోలు...యివన్నీ బ్రీఫ్ కేస్‌లో వేసుకొచ్చాడు.

ఈ బ్రీఫ్‌కేస్ ఫారిన్‌రిటర్న్డు మనస్సుకు ప్రతిబింబం వచ్చిన కొత్తలో అంటే మూణ్ణెల్లవరకూ దీన్ని చాలా నీట్ గా వుంచుకుని మరో అరగంటలో ఎయిరిండియాలో కూర్చోబోయేవారిలాగ హడావిడి పడ్తారు. ఈ సమయంలోనే 'మళ్ళీ' అమెరికా తిరిగెళ్లిపోతాను' అని భయపెడుతూ వుంటారు. ఆ తర్వాత కొన్నాళ్ళకి బ్రీఫ్ కేస్ రోజూ వెంటేసుకుని తీసుకురారు. చేతులూపుకుంటూ భుజాలెగరేస్తూ వస్తారు. ఒకరోజింటినుంచి తీసుకురావటం మర్చిపోయో, మరోరోజు డిపార్టుమెంట్‌నుంచింటికి తీసుకెళ్ళడం మర్చిపోయి మర్రోజు చేతులూపుకుంటు రావటమో జరుగుతూ వుంటుంది. ఈ సమయంలోనే 'నేనిండియాకు రావటంలో తప్పుజేశాను' అంటారు; అంటే 'ఇండియాకు రావటం నేంజేసిన తప్పు' అనర్థం. అనర్థం తెచ్చిపెట్టింది కూడాను అనంటారు. తర్వాత కొన్నాళ్ళకి బ్రీఫ్‌కేస్ సంగతి మర్చిపోతారు. ఇంట్లో వాళ్ళు దాంట్లో పూసలపొట్లాలు, అల్లిక సామాన్లూ పెట్టుకుంటూవుంటారు. ఇవన్నీ చూస్తూనే వుంటాడు. భుజాలెగరెయ్యటం కూడా కొంత తగ్గుతుంది. ఈదశలో 'ఇండియాలో రిసెర్చి చెయ్యటంపడదు. ఫారిన్ తిరిగొచ్చినవాళ్ళసలు పనైయ్యాతేదు

అందుకే ఖొరానా, నార్లికార్, చంద్రశేఖర్‌లాంటి వాళ్లక్కడుండిపోయారు. నేను బుద్ధి తక్కువై యిక్కడకొచ్చాను' అంటాడు. అతగాడనేదక్షరాలా నిజం; అందులో చివరక్షరాలు మరీను.

వీటన్నిటి తర్వాత నాలుగో దశ. ఈ దశలోకొచ్చాక 'ఆః...వాడిబొంద...వాడికేం తెల్సు? స్టాన్‌ఫర్డ్‌గానీ ఆక్స్‌ఫర్డ్‌గానీ వెళ్లాడా? మరింకా కబుర్లెందుకు? హోరు మూసుకూర్చోక. పోనీ మాంచెస్టర్‌గానీ రాచెస్టర్‌గానీ వెళ్లాడా? అదీలేదు; మరి ఏం మాట్లాడకూడదంతే' అంటారు. ఈ దశలోకొచ్చాక యిండియాలో వుండటం తప్పన్సరని తేల్చేసుకుంటారు. అయినా తిడుతూనే వుంటారు — దేశాన్నో విదేశం వెళ్లని వాళ్లనో.

పద్మనాభం డిపార్ట్‌మెంటుకు వెడుతూండగా మధ్యదారిలో మరో బ్రీఫ్‌కేస్ తీసుకొస్తున్న పెద్దమనిషి కనిపించాడు. పెద్దమనిషికూడా అమెరికా నుంచి తిరిగొచ్చిన 'పెద్ద' మనిషి. ఇద్దరూ 'హాయ్'. 'హాయ్' అన్నారు.

'నువ్విక్కడున్నట్టు లండన్‌లో డాక్టర్ మద్దాల చెప్పాడు (అతగాడిపేరు మద్దాల సూర్యప్రకాశరావు); నేను కొన్ని గంటలు మాత్రం లండన్‌లో వున్నాను ... ఏమిటి వార్తలు?' అన్నాడు పద్మనాభం.

వార్తలు చెప్పటం సాగించాడు పెద్దమనిషి '...నుంచి వార్తలు వింటున్నారు' అన్నట్టు మధ్యమధ్యలో 'నేం చెబుతున్నాను ... నేం చెబుతున్నాను' అంటున్నాడు.

పెద్దమనిషి అమెరికా నుంచి వచ్చి 'పూల్' లో దిగాడు. దేశాలు పట్టిన విజ్ఞానవేత్తల్నీ సాంకేతిక నిపుణులనూ దేశానికి రప్పించేందుగ్గాను భారత ప్రభుత్వం 'పూల్' నొకదాన్నేర్పరచింది. 'మిమల్ని పూ(వు)ల్లోపెట్టి పూజిస్తాం... రండి' అని వీళ్ల నాహ్వానిస్తారు. ఇందులో వున్నవాళ్లా యేదో వుడతాభక్తిగా యిచ్చిన సొమ్ము వీరికి ముడుతూ వుంటుంది. ఇదే ఫారిన్‌రిటర్న్‌నిరుద్యోగికీ, స్వదేశీనిరుద్యోగికీతేడా. ఫారిన్‌రిటర్న్ నిరుద్యోకి నిరుద్యోగ పర్వంలోకూడా కొంత జీతంలాంటి దిస్తారు. ఇది స్వదేశీ చిరుద్యోగి జీతాన్ని వొక్కొక్కప్పుడు స్వదేశీ గురుద్యోగి జీతాన్ని కూడా మించుతుంది. ఈ పూల్లోచేరి వకట్రెండు సంవత్సరాలుండి వుద్యోగం వకటి వెతుక్కొని వెళ్లిపోతూవుంటారు. ఈ పూల్ విజ్ఞానవేత్తల పూల్ అనేందుకు యిండియాలో చదివిన వాళ్లనికూడా వేసుకుంటారుగానీ అలాంటి వాళ్ళు చాలా తక్కువ సంఖ్యలో వుంటారు.

ఈ పెద్దమనిషి పూలాఫీసరు. తను పూల్లో చేరాడు; తన పిల్లని స్కూల్లో చేర్చాడు రైమ్‌కోసం (నర్సరీ రైమ్స్ చెప్పే స్కూలండీ అది). తనిప్పుడుద్యోగం వెతుక్కుంటున్నాడు. పూల్లో చేరినవాళ్ల వుద్యోగస్తులు కారుమరి (ఉద్యోగం లేకుండానే ఆఫీసర్లౌతారు) అంతేగాక పూల్ వుద్యోగాలిప్పించదు. ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజిలో రిజిష్టర్జేసుకుని వుద్యోగం వెతుక్కున్నట్టే పూలాఫీసర్లుకూడా వుద్యోగాలు వెతుక్కోవాల్సిందే.

పెద్దమనుష్యు లిద్దరూ మాట్లాడుకుంటూ వుండగా మరోవ్యక్తి వచ్చాడు. ఇతగాడో చిన్నవాడు. ఇదే ఇన్‌స్టిట్యూట్‌లో పిహెచ్. డి. డిగ్రీ నాలుగు నెలల్రికితం తీసుకున్నాడు. ఉద్యోగం యింకా రాలేదు, పిహెచ్. డి. థీసిస్ సబ్మిట్ చెయ్యంగానే అంతవరకూ వచ్చే రెండొందలేభై స్కాలర్‌షిప్పు తీసేసుకున్నారు. 'ఏదైనా చిన్నుద్యోగం యిప్పించండీ' అని ప్రొఫెసర్నడిగితే, పిహెచ్. డి. వచ్చేదాకా 'డిగ్రీరానీ... పోస్టు డాక్టరల్ ఫెలోషిప్పిప్పిస్తాను'అని, అదొచ్చాక —

'అబ్బే...యిదెందుకు...ఫాకల్టీ పొజిషన్లకి అడ్వర్టయిజ్‌మెంటొచ్చినప్పుడు తీసుకుంటాను...వేచివుండు' అని లేచి నుంచుని కూర్చున్న చిన్నవాణ్ణి లేపేవాడు. ప్రొఫెసరిట్లా అనటం వెనకాలోకథుంది. చిన్నవాడు స్వంతంగా వో పేపర్రాసి స్వంతడబ్బుతో పోస్టేజి ఖర్చులుపెట్టి ఆపేపర్ని ఫారిన్ జర్నల్‌లో ప్రచురించాడు. ఆ పేపర్లో ముందుగా ప్రొఫెసర్ పేరెట్టకుండా ప్రొఫెసర్ పేరు ముందు తనపేరుపెట్టాడు. అదీ అతగాడ్చేసిన అపచారం (దీన్నే రిసర్చిలో 'ముందు వెనకల' రాద్ధాంతం అంటారు) అందుకే ప్రొఫెసర్‌గార్కి చిన్నవాడంటే అపేక్ష లేదు; అతగాడి విషయంలో వుపేక్ష చూపిస్తున్నాడు. కానీ ప్రొఫెసర్‌గారి యీమాట ఆధారంగా రాబోయే వుద్యోగంకోసం కాచుకూర్చున్నాడు చిన్నవాడు. ఈ ఉద్యోగాన్ని నమ్ముకుని నమ్మకం చెదిరినప్పుడు బెదిరిపోతూ మరి కొన్నిచోట్ల కప్లయ్‌జేస్తూ యీ ఇన్‌స్టిట్యూట్ ప్రాంతంలోనే కూర్చున్నాడు. కానీ ప్రతి అప్లికేషన్లోనూ 'ఏయే దేశాలడుగుబెట్టావ్?' అని అడుగుతుంటే ఆ 'కాలం' వదిలేస్తూ వుండడంవల్లే తనకు కాలం కలసిరావటంలేదనీ, అది నింపితే తప్ప వుద్యోగం రాదనీ నిశ్చయించుకున్నాడు. అందుకే అప్పుడప్పుడూ ఫారిన్ యూనివర్సిటీల కప్లయ్‌జేస్తూ, సాధ్యమైనంత వరకూ విదేశాలు తిరిగొచ్చిన వాళ్లతో తిరుగుతూ వుంటాడు. అందుకే పూల్లో వున్న పెద్దమనిషిని అప్పుడప్పుడూ 'హలో' అంటూ వుంటాడు. పెద్దమనిషి మాత్రం 'హాయ్' అంటాడు. 'నీకేం? ! నీ పని హాయిగానేవుంది' అని నిట్టూరుస్తాడు చిన్నవాడు. పూల్లోవున్న 'పెద్ద' మనిషికి కొంత 'మనీ' వస్తోంది; యేమాత్రం పని లేదు. చిన్నవాడికి రెండూ లేవు. ఎప్పుడూ డిపార్టుమెంటులో దరఖాస్తుల కాపీల్రాగుతూ, అప్పుడప్పుడూ పెద్దమనిషితో బాటు ఇన్‌స్టిట్యూట్‌లోని కేంటీనుకు వెళ్లి కాఫీల్తాగుతూ, తాపీగా కబుర్లు చెప్పించుకుంటూ వుంటాడు. పెద్దమనిషి కబుర్లుచెప్పి కొన్ని అభయాలిచ్చి, మరి కొన్ని భయపెట్టే విషయాల్జెప్తాడు. ఆ రెండోకోవకు చెందినమాట — 'అబ్బే లాభంలేదు...మీరు అమెరికా వెళ్లిరండి' అన్నది. ఇలాంటి మాటలని చిన్నవాణ్ణి వేపుకు తింటాడు. ఇవి విని విని చిన్నవాడు పోస్టాఫీసు వేపుకు పోతాడు, ఫారిన్ కప్లయ్‌జేసే ప్రయత్నంలో ప్రథమ భాగంగా.

ఈ చిన్నవాడొచ్చి పెద్దమనిషిని 'హలో' అన్నాడు. పెద్దమనిషి చిన్నవాణ్ణి పద్మనాభానిక్కూడా పరిచయం చేశాడు.

'ఇక్కడెందుకు చేశారు పి. హెచ్. డి? ఫారిన్ వెళ్లి చేసి రాకపోయారా?' అన్నాడు పద్మనాభం పైపు నోట్లోపెట్టి బయటకు తీసి పైపు వెనకభాగం దవడకేసి రాచుకుంటూ.

'చాలా తప్పు పనిచేశారు' అన్నాడు పద్మనాభం మళ్ళీ.

'అవును. అదే నేంజేసిన తప్పు' అన్నాడు చిన్నవాడు మూలుగుతూ. చిన్నవాడు మూలుగుతుంటే పెద్దమనుషులు కులుక్కున్నారు. తాటికాయ వుండే మోవని చుట్టూ చూశారు.

'ఇక్కడెక్కడా తాడిచెట్లు లేనట్టున్నాయ్. ఉంటే అక్కడికెళ్లి నిలబడదాం ...తాటికాయ దొరుకుతుంది' అన్నాడు పద్మనాభం.

మూలుగుతున్న చిన్నవాడి అహం దెబ్బ తింది; మొహం కందింది, ఈలోపల మెదడుకో ఆలోచనందింది. దాంతో—

'అయ్యా !' అన్నాడు.

'య్యా' అన్నాడు పద్మనాభం.

'మీరు చదివిన దేశంలోని చాలా యూనివర్సిటీల్లో పిహెచ్.డి. డిగ్రీ తెచ్చుకునేందుకు చేయాల్సిన పనుల్లో డిజర్టేషన్ ఒక భాగమేకదా...పార్షియల్ ఫుల్‌ఫిల్‌మెంట్...కొన్ని కోర్సుల్తీసుకుని వాటికి జమ కట్టించుకుని తర్వాత భాగంగా డిజర్టేషన్ సబ్మిట్‌చేస్తారు. కాని యిక్కడ కోర్సు వర్కేంలేదు; కొన్ని కొన్నిచోట్ల సోర్సాఫ్ యిన్‌స్పిరేషన్ వుండదు ...' అంటున్న చిన్నవాణ్ణడ్డుకుని—

'కోర్సు వర్కులేకుండా థీసిస్ సబ్మిట్ చెయ్యటమేమిటండి ?! ఇక్కడ కోర్సు వర్కుండదా ? !' అని ఆశ్చర్యంతో మూర్ఛబోయినంత పన్జేశాడు పద్మనాభం. పద్మనాభం మూర్ఛబోయినా యీ చర్చ యింతటితో ఆపదల్చుకోలేదు చిన్నవాడు.


'మూర్ఛబోకండి...పోయినా లేపి మీకీ విషయం చెబుతాను ... సంజీవ పర్వతం యీ ప్రాంతంలోనే వుందిట...అయ్యా... కోర్సు వర్కుండదు. కాని అవన్నీ చదువుకోవటం జరుగుతోంది. అయినా వాటికి క్రెడిట్ రాదు. ఇంతాచేసి థీసిస్‌రాసి సబ్మిట్ చేస్తే దానికి డిగ్రీ యివ్వవచ్చని ఫారిన్ ప్రొఫెసర్లు సర్టిఫికెట్టివ్వాలి. ఇండియాలోని ప్రొఫెసర్ గైడ్‌గా వుండొచ్చుగానీ ఆ గైడే థీసిస్ గురించేం చెప్పకూడదు. చివరికి మనసేం చెప్పనివ్వరుగదా అని మొదట్నుంచే యేమీ చెప్పరు కొందరు 'మార్గదర్శకులు' (గైడ్లు). ఒకవేళ అలాంటి వాళ్లు చెప్పినా మరో యిద్దరు ఫారిన్ ప్రొఫెసర్లు డిగ్రీ యివ్వవచ్చని చెబితేగానీ డిగ్రీ రాదు. కాని మీరు మీ యూనివర్సిటీ వాళ్లదగ్గిరే చదువుకుంటూ, వాళ్లదగ్గిరే మీ అనుమానాల్తీర్చుకుంటూ వాళ్లకే మీ థీసిస్ సబ్మిట్ చేస్తారు. అందువల్ల మీ డిగ్రీ తక్కువని నేననటంలేదు. ఎవరి విషయంలో యెక్కువ రిస్కుందో ఆలోచించ మంటున్నాను ... అంతే' అని చిన్నవాడెళ్లిపోయాడు.

పద్మనాభం ముఖం వాచింది ... ముఖమంతా చేత్తో తడుముకుని —

'వాట్?...ఇతగాడు వేసింది చివాట్లా?' అనుకుని తర్వాత 'షీయూ' అని అవతలి వాడితో అని పద్మనాభం వెళ్లిపోయాడు.

చిన్నవాడిట్లా మాట్లాడటానికో కారణం వుంది. ఓ నెల్రోజుల క్రిందటే విదేశీ యూనివర్సిటీలోని ఒక పోస్టు కప్లయ్ జేశాడు. అప్లికేషన్ పంపినందుకెంతో సంతోషించామనీ, పోస్టివ్వ లేనందుకు విచారిస్తున్నామనీ తెలియజేశారు. పోస్టివ్వలేక పోవటానికి కారణం తమ దేశంలో పిహెచ్.డి. తీసుకున్న వాళ్లప్లయ్ చెయ్యటం అని విశదీకరించారు. చిన్నవాడు మండిపడ్డాడు. 'ఇండియాలో పిహెచ్.డి. తీసుకున్న వాళ్లకంటే బయట డిగ్రీ పుచ్చుకున్న యిండియన్స్‌కు యిండియాలో డిమాండుంది. బయటవాళ్లూ అక్కడి వాళ్లకే యిస్తున్నారు. ఇంక ఇండియన్ డిగ్రీల్తీసుకున్న వాళ్లేమవ్వాలి?'—యివన్నీ వూహించుకుని పద్మనాభం దగ్గిర చిందుల్దొక్కాడు ...

వూళ్లో వున్న పెద్దమనిషికూడా తన డిపార్ట్‌మెంటుకు వెళ్లాడు. వెళ్లి రెండుత్తరాలు టైపు చేయించాడు. ఆ రెండింటిలో వకటొక యూనివర్సిటీకి, యింకొకటి మరో పెద్ద ఇన్‌స్టిట్యూట్‌కూ రాశాడు. అందులో తన అర్హతలన్నీ విశదీకరించాడు. తనను సెలెక్టు చేసుకునే అర్హతలన్నీ వారికున్నట్టు వివరించాడు. ఆ అర్హత వాళ్లకున్నట్టు చెప్పటానికో విధానం వుంది. 'మీ ఇన్‌స్టిట్యూట్‌లో ఫలానా సౌకర్యాలున్నట్టు తెలిసింది' అని మొదలెడ్తాడు. ఆ అవకాశాలు (లాబ్, ఎక్విప్‌మెంటు వగైరాలు) తనలాంటి వాడి చేతిలో సద్వినియోగ మవ్వటమేగాక రాణిస్తాయని కూడా తెలియజేస్తాడు. రాణిస్తాయని రాసేస్తాడు కూడాను. స్వదేశీ నిరుద్యోగికీ ఫారిన్ రిటర్న్డ్ నిరుద్యోగికీ (యితగాణ్ణి పూలాఫీసరని పిలుస్తారుగదా) యిదే తేడా. స్వదేశీ నిరుద్యోగి అడ్వర్టయిజ్‌మెంటు లేందే అప్లయ్ చెయ్యడు. ఫారిన్ రిటర్న్డ్ నిరుద్యోగి అడ్వర్టయిజ్‌మెంట్ లేకుండానే ఇన్‌స్టిట్యూట్ పెద్దల దగ్గరకు నిర్భయంగా వెడతాడు. పట్టుకొచ్చిన డాలర్లమూట మోటుగావుంటే ప్లేన్‌లో కూడా వెడతాడు. ఇలా వెళ్లి పెద్దవాళ్లని కలుసుకోటంవల్ల యితరుల అభిప్రాయాలు 'కలుసుకున్న వాడెక్కడ చదివాడు'



అన్న విషయంమీద ఆధారపడి వుంటయ్. ఈపని స్వదేశీ నిరుద్యోగిచేస్తే, 'కాకా' అంటారు. చెన్నపురిలో వుండొచ్చినట్టున్నా డంటారు; వెన్నపూస రాస్తున్నాడంటారు; చిన్నచూపు చూస్తారు. ఎవరిదగ్గరికెళ్తే వెడతాడో వాళ్ళా అంతే; వెళ్ళగా చూసిన వాళ్ళా అంతే. ఆపనే ఫారిన్ రిటర్న్డ

## ఫారిన్...

నిరుద్యోగి చేస్తే అలాంటివేం అనరు. 'దేశంలోవుండి సేవ చెయ్యాలనే వుద్దేశ్యంతో వున్నాడు మరి' అంటూ ప్రశంశా పత్రం పడేస్తారు.

ఈ దారిగుండా వెళ్ళినపుడు స్వదేశీ నిరుద్యోగికి వుద్యోగం దొరక్కపోతే—

'వెధవకి లోగం తక్కువ కుదిరింది· ఎత్తులు పారలేదు; యిహ వమ్ములుండాల్సిందే' అంటారు.

అదే ఫారిన్‌రిటర్న్డ నిరుద్యోగికి రానప్పుడు—ఆ ఇన్‌స్టిట్యూట్ కదృష్టంలేదు. అతగాడికేంపోయింది? మళ్ళీ తిరిగి అమెరికా వెళ్ళిపోతాట్ట... దేశంలో వ్యవహారాలిలా అఘోరిస్తున్నయ్యనే అతగా డమెరికానుండి తిరిగొచ్చేటప్పుడే తిరిగెళ్ళటానికి ప్లేన్ టికెట్ కొనుక్కొచ్చాట్ట' అని అతగాడికి వుద్యోగం యివ్వనివాళ్ళేగాక దేశం మొత్తాన్ని దులిపి దుమ్మెత్తిపోస్తారు. ఈ నిరుద్యోగులిద్దరి మధ్యా యింత భేదం వుంది; యిద్దర్నిగురించి యిట్లా వాదం చేసుకుంటూరు మిగతావాళ్ళు.

...పూలాఫీసరు కుద్యోగం వచ్చింది. ఈ యిన్‌స్టిట్యూట్‌నుంచి వెళ్ళిపోతున్నాడు. స్వదేశీ నిరుద్యోగికింకా వుద్యోగం రాలేదు. పూర్వాశ్రమంలో పూలాఫీసర్‌గావున్న పెద్దమనిషిని రైలెక్కించి మరో రిసర్చి స్కాలర్‌తో స్టేషన్నుంచి తిరిగొస్తున్నాడు స్వదేశీ నిరుద్యోగి. ఈ రిసర్చి స్కాలర్ రెండు మూణ్ణెల్లల్లో థీసిస్ సబ్మిట్ చెయ్యబోతున్నాడు. నాల్రోజుల్నాడే కెనడాలోని ఒక యూనివర్సిటీనుంచి పోస్టుడాక్టరల్ రిసర్చికి అవకాశం వుండొచ్చునన్న ఆశాభావాన్ని కలిగిస్తూ వో వుత్తరం వచ్చింది. ఇంతవరకూ ఫారిన్‌రిటర్న్డ వ్యక్తుల గురించిన వుద్దేశాల్లో తటస్థంగా వుండేవాడు. కానీ పైన చెప్పిన వుత్తరం వచ్చిన దగ్గర్నుంచీ స్వదేశీ నిరుద్యోగి బాధపడుతూ తన సొదంతా చెప్పుతుంటే—

'లాభం లేదండీ...వకసారి ఫారిన్ వెళ్ళొస్తే నయం' అంటున్నాడు.

ఇప్పుడు స్టేషన్నుంచొస్తూ కూడా రిసర్చి స్కాలర్ యిదేమాట పెట్టాడు. 'ఏమైనా వకసారి ఫారిన్‌వెళ్ళొస్తే నయమండీ' అన్నాడు. నిరుద్యోగి చిందులొక్కాడు. ఇతగాడికీ అలవాటు చిన్నప్పు

## జయభాదురికి పెళ్ళయిందా?
## కె. వి. ఇకలేరు!
## ఫైనాన్సు కార్పొరేషన్ కొత్త డైరెక్టర్లు!

నటించిన తొలి చిత్రంతోనే ప్రేక్షక హృదయాల్లో అపూర్వస్థానం సంపాయించుకొన్న నటి జయభాదురికి వివాహం అయిందనే వార్త ఒకటి వెలువడింది. ఈ వార్త పరిశ్రమలోని వార్ని, ప్రేక్షకుల్ని దిగ్భ్రాంతుల్ని చేసింది. పూనా ఫిలిం యిన్‌స్టిట్యూట్‌లో, చేరటానికి ముందే ఆమె వివాహం చేసుకున్నదిట. ఆమె భర్త కలకత్తాలో ఇంజనీర్.

పాపం, జయభాదురిని యీ వదంతి అంతటితో వదిలి పెట్టలేదు. ఆ భర్త ఆమెను నానాబాధలూ పెట్టాడని, అవి భరించలేక అతనికి దూరమై బ్రతకాలని జయ నిర్ణయించుకుందనీ ఆ వార్తలో ఉంది. మీకు వినాలని ఉత్సాహం ఉంటే ఆమె భర్త పేరు భాస్కర్ చౌదరి.

జయభాదురి యిపుడు నటిగా తారాపథానికి చేరుకుంది గనుక, ఆమెను తిరిగి తన దగ్గరకు తీసుకు వెళ్ళాలనుకుంటున్నాడట. కాని, జయ విడాకులు కోరుతున్నదిట. జయభాదురి, అమితాబ్‌బచన్ కలిసి 10 లక్షల రూపాయలు అతనికి యిచ్చి, ఆమెను అతని నుంచి విడిపించాలని ప్రయత్నిస్తున్నారు. కాని అతను ఒప్పుకోవటం లేదు. ఈ వార్తమీద జయభాదురి రియాక్షన్ ఏమిటి?

ఈ విషయం అడిగితే జయ పగలబడి నవ్వి—'నాకు తెలిసింది ఒకే ఒక భాస్కర్ చౌదరి· అతను మా యిన్‌స్టిట్యూట్‌లో మా బాచ్ ఏక్టింగ్ స్టూడెంట్. మేము మంచి స్నేహితులం. అతను త్వరలో ఇన్‌స్టిట్యూట్‌లో లెక్చరర్‌గా చేరబోతున్నాడు. పాపం భాస్కర్ చౌదరి కెరీర్‌కి ఇది ఎఫెక్ట్ కాకూడదని ఆశిస్తాను' అన్నది.

*   *   *

సెప్టెంబరు 17 వ తేదీ ఉదయానే విషాద వార్త వినవలసి వచ్చింది. అది ప్రముఖ దర్శకుడు శ్రీ కె. వి. రెడ్డి పోయారనేది ...

పరిశ్రమలో అంతా ఆయన్ని కె. వి. అని పిలుస్తారు ఆప్యాయంగా. మనిషి ఎంత ఆజానుబాహుడో, అంత గంభీరుడు· మంచి డిసిప్లిన్ కలిగిన వ్యక్తి భక్తపోతన, యోగి వేమన, గుణసుందరి కథ, పాతాళభైరవి, జగదేక వీరుని కథ, మాయాబజారు, శ్రీకృష్ణార్జున యుద్ధం, శ్రీకృష్ణసత్య వంటి విశిష్ట పౌరాణిక జానపదాలే గాక— పెద్దమనుషులు, పెళ్ళినాటి ప్రమాణాలు, దొంగరాముడు వంటి ఉత్తమ సాంఘికాలకు కూడా దర్శకత్వం వహించి దర్శకుల శ్రేణిలో తనకొక ప్రత్యేకతను సృష్టించుకున్నారు.

శ్రీ కె. వి. పోవటం తెలుగు చలనచిత్ర పరిశ్రమకు తీరనిలోటు!

*   *   *

కేంద్రప్రభుత్వ సమాచార మంత్రిత్వ శాఖ— ఫిలిమ్ ఫైనాన్స్ కార్పొరేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌ని అక్టోబరు మొదటి తేదీ నుంచి ప్రారంభమయ్యే కొత్త సంవత్సరానికి యీ దిగువ వారిని ఎన్నుకున్నది.

చైర్మన్‌గా శ్రీ బి. కె. కరంజియా కంటిన్యూ అవుతారు· ఎం. టి. వాసుదేవన్ నాయర్, శ్రీమతి తేజీబచ్చన్, హృషికేశ్ ముఖర్జీ, డాక్టర్ వి· కె. నారాయణమీనన్, మోహన్ రాకేష్, ఎస్· ఆర్. వకీల్, ఎం. ఎ. యస్. రాజన్— యితర సభ్యులు.

—మోహన్‌కుమార్

ట్నుంచి వచ్చింది. తమెక్కొవల్సిందివ్వేక్ బోతే తమ అసంతృప్తినీ, అభ్యంతరాన్ని చిన్నపిల్లలు చాలారకాలుగా చూపిస్తారు. కొందరు యింటికప్పెకే ముప్పుతెస్తారు; మరికొందరు కాళ్ళ నేలమీద వేగంతో తాటిస్తూ చిందులొక్కుతారు. స్వదేశీ నిరుద్యోగి రెండోకోవకు చెందినవాడు; యిప్పటికీ ఆ దోవనే వెడుతున్నాడు. కాస్సేపు చిందులొక్కి—

'ఏమిటండీ మనం వో యేడాదక్కడి కెళ్ళి నేర్చుకునేది? అసలు వెళ్ళేం చేశా రన్నది గాకుండా వెళ్ళారా లేరా అనే చూస్తున్నారిప్పుడు. అక్కడేం చెయ్యకుండా వెళ్ళిరాగానే అయిపోయిందిటండీ? అడిగే వాళ్ళు లేగానీ...మరీ యీరోజుల్లో సిలోన్ వెళ్ళినా, ఆఫ్రికావెళ్ళినా, మరో చిన్నదేశం వెళ్ళి తిరిగొచ్చినా ఫారిన్‌రిటర్న్డ్ గావటమే గాకుండా విజ్ఞానిగాకూడా పరిగణిస్తున్నారు ...అసలు పోస్టిచ్చే ముందు 'ఫారిన్ వెళ్ళావా? యస్‌ఆర్‌నో? నో అయితే యెందుకెళ్ళలేదు. యస్సయితే యేంలేదు; వుద్యోగంవుంది; అది నీది అనటం ఫ్యాష నైపోయింది. ఈ ఫ్యాషనిప్పుడు మితి మీరింది' అని చిటపటాడుతూ చివాట్లు పెట్టాడు.

రిసెర్చి స్కాలర్ చిన్న బుచ్చుకుని వొచ్చుకున్నా నిరుద్యోగి చెయ్యిపుచ్చుకుని మెచ్చుకుంటున్నట్టు చూస్తూ—

'మీర్చెప్పింది నిజమే...కానీ యిట్లా ఫారిన్ వెళ్ళొచ్చావా అడగటం, వెళ్ళిరావా లనటం, వెళ్ళందే పోస్టు రాదనటం యిప్పుడే మొదలవ్వలేదు. ఎప్పుడో పురాణ కాలంలోనే వుందీ అలవాటు ... మీకా కథ తెలిసినట్టు లేదే', అన్నాడు.

'ఏం కథ' అన్నాడు స్వదేశీ నిరుద్యోగి.

వీళ్ళెక్కిన బస్సు నిరుద్యోగి హాస్టలు దగ్గరి కొచ్చింది.

'సరే...మీ హాస్టలొచ్చింది దిగెయ్యండి 'ఫారిన్‌మేనియా' పురాణకాలంలోనే వుందన్న సత్యాన్ని రేపు నిరూపిస్తాను' అన్నాడు రిసర్చి స్కాలర్.

బస్సాగింది ... నిరుద్యోగి తన బస కెళ్ళాడు.


## శ్రీ భద్రాచల క్షేత్రములో సహస్ర చండీ మహారుద్ర యాగశరన్నవరాత్రోత్సవములు

**ది. 8–10–1972 నుండి 18–10–1972 వరకు**

శ్రీ వెంకటరమణ మహర్షి నిరతాన్నదాన శ్రీ అంబాసత్రమునందు జరుగును.

భక్తులు వేలాదిగా పాల్గొని విరాళము లొసంగి లోకకల్యాణము, విశ్వశాంతి చేకూర్చగలరు.

**పూజలు: రు. 58/–ల నుండి రు. 1116/–ల వరకు గలవు**

**అల్లూరి మూర్తిరాజు,**

అధ్యక్షులు.


(శ్రీ రామాలయ ట్రస్టు బోర్డు చైర్మన్)

భద్రాచలం,
18—9—72.

**గమనిక:**—గోత్రనామములతో విరాళములు పంపుటకు చిరునామా

**పి. నారాయణరావు,**

ట్రెజరరు,
చండీయాగ భక్తసంఘం
భద్రాచలం.





# ఫారిన్ రిటర్న్డు లేక స్వదేశీ ఉద్యోగ పర్వాలమ అతీతులు

లేళ్ళపల్లి వెంకటలక్ష్మీనారాయణ

## మూడవ కథ

# లక్షోపాయాలు - లక్ష్యసాధన



మర్రోజు ప్రొద్దున్నే నిరుద్యోగి రిసర్చి స్కాలర్ దగ్గరికొచ్చాడు. రిసర్చి స్కాలర్ డిపార్ట్మెంటుకు బయల్దేరబోతున్నాడు.

'నాతో కథ చెబుతానన్నావ్...చెప్పు... పురాణకాలంలో కూడా ఉద్యోగాలకు ఫారిన్ వెళ్ళిరావాలనే నియమం వుందన్నావ్; ఏమిటా కథ?' అన్నాడు స్వదేశీ నిరుద్యోగి. రిసర్చిస్కాలర్ మొదలెట్టాడు.

'పూర్వం కైలాసంలో జరిగింది కథ. ఇప్పటికీ రికార్డులున్నయ్. ఇక్కడ పోస్టుకు మరెక్కడికో వెళ్ళిరావాలన్న నియమం అప్పట్నుంచే వచ్చింది. ఇంతకూ అక్కడ జరిగిన సంగతిది. గణాధిపతి పోస్టు ఖాళీ అయ్యింది. అప్పట్లో ఖాళీ అవ్వలేదు; అది సృష్టించారు. ఉన్న పోస్టులు రావాల్సినవాళ్ళ కివ్వకుండా వాళ్ళక్కావాల్సిన వాళ్ళకివ్వటం, కావల్సిన వాళ్ళకోసం పోస్టులు క్రియేట్ చెయ్యటం ... యివన్నీ అప్పుడూ వున్నయ్. కానీ గణాధిపతి పోస్టు క్రియేటయ్యాక యిద్దరభ్యర్థు లొచ్చారు రంగం మీద. ఒకడు కుమార స్వామి; మరొకడు వినాయకుడు. వీళ్ళిద్దర్లోంచి సెలక్టు చేసుకునేందుకుగాను ఫారిన్ వెళ్ళిరావటం అన్న క్వాలిఫికేషన్ పెట్టారు. ఫారిన్ వెళ్ళటమంటే యేదో ఒక విదేశం వెడితే సరిపోదు; యిప్పుడింకా నయం—యే ఒక్క దేశంవెళ్ళి వొక రోజున్నా ఫారిన్ వెళ్ళటం క్రిందే లెక్క పెడుతున్నారు. కానీ ఆ రోజుల్లో కుమార స్వామినీ, వినాయకుణ్ణీ ప్రపంచమంతా తిరిగిరమ్మన్నారు. చూశావా మరి! ఫారిన్ వెళ్ళిరావటం క్వాలిఫికేషన్లలో ఒకటిగా కాకుండా, అదే క్వాలిఫికేషన్‌గా యెప్పుడోనే నిర్ణయం చేశారు' అని ఆపుజేశాడు రిసర్చిస్కాలర్.

నిరుద్యోగి సూటిగా రిసర్చిస్కాలర్ వంక గంభీరంగా చూశాడు. రిసర్చిస్కాలర్ నవ్వాడు...కాస్సేపయ్యాక నిరుద్యోగి యేదో గుర్తుకొచ్చినట్టు తలాడించి ఫెళ ఫెళా నవ్వాడు. రిసర్చిస్కాలర్ నవ్వాపుకుని 'ఏమిటీ కథ?' అన్నట్టు నిరుద్యోగి వంక చూశాడు. నిరుద్యోగి చెప్పటం మొదలెట్టాడు:

'నువ్వు చెప్పిన కథంతటితో అవ్వలేదు, జరగాల్సిందంతా జరగాల్సిన విధంగా తర్వాత జరిగింది. అదంతా ఏంటే ఆ కథ

లోని అసలు 'నీతి' బయటపడుతోంది: నువ్వు చెప్పిందాంట్లో నీతి లేదు; అసలు నీతి, పూర్తిగా ఆ కథ నేం జెబుతాను విను.'

'గణాధిపతి పోస్టుకు ఫారిన్ వెళ్ళి రావటం అందునా ప్రపంచం అంతా తిరిగి రావటం ముఖ్యం గదా అని కుమారస్వామి నెమలి వాహనం యెక్కి 'రంయ్'మంటూ వెళ్ళిపోయాడు. వినాయకునికి ఫారిన్ వెళ్ళే ఆర్థికశక్తి, వాహనశక్తీ లేదు. అతగాడి వాహనం శక్తిలేని యెలుక. అసలా వాహనం అప్పట్నుంచుందో, పోస్టులో కెళ్ళా కొచ్చిందో తెలీదు. కంపెనీల్లోని పెద్దుద్యోగస్థులకు కార్లిస్తున్నట్టా రోజుల్లో గణాధిపతికి ఎలుకనిచ్చుంటారు. కారణం యేమయినా వినాయకుడు యిల్లు కదల్లేక పోయాడు. అందువల్ల వినాయకుని స్నేహితులు శివుడ్దగ్గరికెళ్ళి—

'యిట్లా ఫారిన్ వెళ్ళిరమ్మనటంలోని అంతరార్థం యేమిటి? ఏమిటా రహస్యం? శెలవివ్వండి' అన్నారు.

'ఫారిన్ వెళ్ళిరమ్మంటే ఫారిన్ వెళ్ళి తిరిగిరమ్మని కాదు. జ్ఞానం వృద్ధి జేసుకొమ్మని వెళ్ళమన్నాను. ఫారిన్ వెడితే అందుకవకాశా లెక్కువ. అందుకే ఫారిన్ వెళ్ళాలన్నది నిబంధనగా పెట్టాను'అన్నాడు శివుడు.

'అయితే ఆ జ్ఞానాభివృద్ధి యిక్కడి నుంచే సాధిస్తాను' అని వినాయకుడు కైలాసదేశంలోనే వుండి జ్ఞానాభివృద్ధికి పాటుపడసాగాడు. కుమారస్వామికి అందువల్ల ప్రతిదేశంలోని నదిలోనూ స్నానం చేసేటప్పుడు వినాయకుడు కనిపించసాగాడు; ఇండియాలో వున్నవాళ్ళ పేపర్లు ఫారిన్ జర్నల్సులో పడుతుంటే ఫారిన్ వెళ్ళిన యిండియన్స్ చూస్తున్నట్టుగా నన్నమాట ...శివయ్య వినాయకుడి విజ్ఞానాన్ని చూసి యెంతో మెచ్చుకున్నాడు. 'ప్రపంచమంతా తిరిగి సాధించిన జ్ఞానానికంటే కొంచెం యెక్కువే సాధించావ్...నిన్నే గణాధిపతిగా వెయ్యొచ్చున'న్నాడు సంతోషంతో.

ఈ మాటలు విన్న సెలెక్షన్ కమిటీలోని కుమారస్వామి హితులు ముందుకొచ్చి శివుణ్ణి వుద్దేశిస్తూ హడావిడిగా—

'ఆగండాగండి... కుమారస్వామి ఫారిన్ తిరిగొస్తున్నాడు ...ఈ పోస్టు కతగాడే తగును. అప్పాయింట్‌మెంటార్డర్ దక్కాడికే పంపిద్దాం; లేదా ఆర్డర్ తీసుకుని నన్నెళ్ళి యిచ్చిరమ్మన్నా యిచ్చొస్తాను. లేదా అతగాణ్ణే రమ్మందాం ... వచ్చేస్తూ వుంటాడిపాటికి...ఆగండి' అన్నాడు.

శివుడు మందహాసం చేస్తూ 'సరే... ఆగుదాం' అంటూ ఆర్డర్ను ప్రక్కనపెట్టి కూర్చున్నాడు. కుమారస్వామి కొంచెం లేటుగా మరి కొంచెం నీటుగా వచ్చి—

'ఫారిన్ వెళ్ళొచ్చాను...య్యా... ఫారిన్ వెళ్ళి తిరిగొచ్చాన'న్నాడు భుజాలెగరేస్తూ.

శివుడు మెల్లగా నవ్వుతూ—

'నాయనా! కుమారస్వామీ! ఫారిన్‌వెళ్ళి యేం చేసొచ్చావయ్యా' అన్నాడు.

'ఇంకేం చెయ్యాలి? ఫారిన్ తిరిగొచ్చా న'న్నాడు కుమారస్వామి వూగిపోతూ.

'అందుకే బాబూ...గణాధిపతి పోస్టు వినాయకుని కిస్తున్నాను' అన్నాడు శివుడు.

'అదీ కథ' అన్నాడు నిరుద్యోగి.

'ఆ రోజుల్లో ధర్మం వుంది కాబట్టి 'ఫారిన్‌వెళ్ళి యేం జేశారు?' అని చూసే వాళ్ళు. ఇప్పుడదేం లేదు. ఫారిన్ వెళ్ళటమే కావాల్సింది. అందుకనే అప్లికేషన్లలో 'ఏ దేశం వెళ్ళావ్?', 'ఎన్నేళ్ళు లేదా ఎన్నాళ్ళున్నావ్?' అనడుగుతున్నారు గాని 'ఏం జేశావ్?' అన్న సంగతెవ్వరూ పట్టించుకోవటం లేదు' అన్నాడు నిరుద్యోగి లేస్తూ. రిసర్చి స్కాలర్ ముఖం ముడ్చుకుని, కాళ్ళు ముడుచుకుని మంచం మీద పడుకున్నాడు. ఇతగాడు ప్రతిరోజు లోనూ యెక్కువభాగం పైన చెప్పిన పనుల్లో రెండో పన్జేస్తూ వుంటాడు ... నిరుద్యోగి డిపార్ట్‌మెంట్ వేపుగా పోస్టు తీసుకు బయల్దేరాడు. నిరుద్యోగి వెళ్ళిన కాస్సేపటికి—

'గుడ్‌మాణింగ్...హవ్వార్‌య్యూ, గై' అంటూ గాలిలా ఒకతను రిసర్చి స్కాలర్ రూములోకి జొరబడ్డాడు. లక్షణాలన్నీ ఫారిన్‌వెళ్ళి తిరిగొచ్చిన వాడికున్నట్టే వున్నయ్. వేషం అట్లాగే వుంది. భాష కూడా అంతే ... కానీ అతగాడు ఫారిన్ వెళ్ళలేదు. వెళ్ళాలని తహ తహ లాడుతున్నాడు; వెళ్ళొచ్చిన వాళ్ళలాగే తళతళ లాడుతున్నాడు. వెళ్ళటానికి ప్రయత్నాలు మాత్రం బోల్డు చేస్తున్నాడు. అందులో ప్రథమ భాగంగా యింగ్లీషు సినిమా లన్నీ చూస్తున్నాడు. వాళ్ళ మాట్లాడినట్లు 'షట్' అని, 'డామ్ దట్', 'డామ్ దిస్' అని, 'బుల్‌షిట్' అనీ... యింకా అనేకం అమెరికన్ 'శ్లాంగ్'లో మాట్లాడ గలడు. అమెరికన్ 'కౌబాయ్'లా వుంటాడు. ఫారిన్ వెళ్ళేవాళ్ళని విమానాశ్రయందాకా వెళ్ళి సాగనంపుతూ ఫారిన్ వెళ్ళేటప్పుడు చెయ్యాల్సిన పనులన్నీ నేర్చుకున్నాడు. వీటన్నిటితో యితగాడిప్పుడు తనని అమెరికాలో పారేసినా తనంతట తాను నిలబడగల్గి నెగ్గుకు రాగల నంటాడు ... అయినా అవకాశం మాత్రం రాలేదు.

ఇతగాడి కెలాగైనా ఫారిన్ వెళ్ళిరావాలని మహా వుబలాటంగా వుంది. రిసర్చికని ఈ యిన్‌స్టిట్యూట్‌లో జేరి మొదటి రెండు సంవత్సరాలూ రిసర్చిసేటు (డాక్టరల్ ప్రోగ్రాంలో) కోసం ప్రతి విదేశీ విశ్వ విద్యాలయానికీ అప్లయ్ జేశాడు. జి. ఆర్. ఇ. (గ్రాడ్యుయేట్ రికార్డ్ ఎక్జామినేషన్)కు కూర్చున్నాడు. 'టోఫెల్' (TOFEL) అంటే టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్ యాజ్ ఎ ఫారిన్ లాంగ్వేజ్, కూడా కూర్చున్నాడు. వీటిల్లో గ్రేడ్సురాసి అప్లయ్‌చేస్తే యే యూనివర్సిటీలోనూ ప్రవేశం దొరకలేదు. లైబ్రరీకి వెళ్ళి 'వరల్డ్ ఆల్మినాక్' పుస్తకం చూసి ప్రతిదేశంలోని ప్రతి మారుమూల యూనివర్సిటీకి అప్లయ్ జేశాడు. ఈ ప్రయత్నాలూ కలిసిరాలేదు. జవాబులు అడ్మిషన్ లెటర్తో కలిసిరాకుండా రిగ్రెట్ లెటర్తో కలిసొచ్చేవి... ఇంతలో ఈ యిన్‌స్టిట్యూట్‌లో నాలుగేళ్ళు గడిచినయ్. ప్రొఫెసర్తో మంచిగా వుంటూ, అవీ యివీ పంచి పెడుతూ వుండటంవల్ల పి. హెచ్. డి. రాకముందే అతగాణ్ణి సీనియర్ టెక్నికల్ అసిస్టెంటనే జూనియర్ స్టాఫ్ పొజిషన్లోకి తీసుకున్నారు.

ఇక డాక్టరల్ ప్రోగ్రాం వదలివేసి పోస్ట్ డాక్టరల్ ప్రోగ్రాంకు అప్లయ్ చెయ్యడానికో పద్ధతి కనిపెట్టాడతగాడు. ఫారిన్ జర్నల్‌చూసి తనప్లయ్‌చేసే యూనివర్సిటీలోని ప్రొఫెసర్లెవరి పేరన్నా దాంట్లో పడితే వెంటనే ఫలానా పేపరు

ఫలానా జర్నల్‌లో పడిందని విన్నాననీ, ఆ జర్నల్ తన యిన్‌స్టిట్యూట్‌కు రావటం లేదనీ, ఆ పేపర్ చాలా బాగుందని అగ్‌స్ప్రిక్‌ద్వారా మరోచోటునుంచి గ్రహించాననీ, ఆ పేపర్తనకెంతో వుపయోగిస్తుందని, తామిద్దరూచేసే రిసర్చి చూడగా ఒకటిగానే తోస్తోందని, 'రీ ప్రింట్' వకటి పంపితే యెంతో కృతజ్ఞుణ్ణనీ, ఆ పేపర్ రీ ప్రింటొచ్చేంతవరకూ తన రిసర్చి ఆగిపోతుందనీ... యిలా చాలా రాస్తాడు. రీప్రింటొచ్చాక దాన్నోమూల పడేసి వో యిరవై రోజుల్తర్వాత ఆ ప్రొఫెసర్‌కో వుత్తరం రాసి దాంట్లో తను కొద్దికాలం లోనే థీసిస్ సబ్మిట్ చెయ్యబోతున్నట్టు, తర్వాత ఆ ప్రొఫెసర్ క్రింద పనిచెయ్యాలనే కోరికతో వున్నట్టు తెలియజేస్తాడు.. ఇలా చాలా రాశాడు. కానీ 'నీకు ఎడ్వాన్స్‌డ్ మేథమెటిక్సు' వచ్చా అనో, స్టాటిస్టిక్స్ వచ్చా అనో లేదా 'థీసిస్ సబ్మిట్ చెయ్ చూద్దాం; థీసిస్ సబ్మిట్ చేస్తావని ఆశిస్తూ, శుభాకాంక్షలు తెలుపుతూ' అంటూ జవాబులొచ్చేవి. మరికొందరు

## ఫారిన్ ...

ప్రొఫెసర్లు తాము మరో అయిదేళ్లవరకూ 'బిజీ'గా వుండబోతున్నట్టు తెలియజేశారు...మొత్తానికి దారి కూడా గమ్యానికి చేర్చలేదు.

ఇప్పుడు మూడోదశ కొచ్చాడు. ఇప్పుడు ప్రతిరోజూ లైబ్రరీకి వెడుతున్నాడు. 'ఇతగాడింతకాలం థీసిస్ విషయంలో జాగు చేశాడుగానీ యిప్పుడు బాగుపడుతున్నట్టున్నాడు' అనుకున్నారందరూ. ఇంతకూ లైబ్రరీకి వెళ్లి యితగాడ్చేసే పని యిది: కొన్ని 'జర్నల్సు'లో చివరి పేజీలలో అదొచ్చేదేశంలోని వుద్యోగాల ప్రకటనలు (ఆ సబ్జక్టుకు సంబంధించినవి) వేస్తూ వుంటారు. ఇతగాడివన్నీ రాసుకొచ్చేందుగ్గాను రోజూ లైబ్రరీ కెడుతున్నాడు. డిపార్ట్‌మెంట్‌లో 'యెక్కడి కెడుతున్నావ్?' అంటే 'లైబ్రరీకి' అని ధీమాగా చెబుతాడు. ఇంతవరకూ యితగాడిట్లా చాలా వాటి కప్లయ్ జేశాడు. డిపార్ట్‌మెంట్‌లో యితగాడి ప్రక్కనో ఉక్కు అలమరా



వుంది. దాంట్లో వున్న అయిదు అరలకూ అయిదు కాగితాలంటించాడు; వాటి మీదిలా రాసుంది: 1) యు. ఎస్. ఏ 2) కెనడా 3) యు కె 4) ఆస్ట్రేలియా 5) మిసలేనియస్. ఈ దేశాల్లోని యూనివర్సిటీల లోనూ, వ్యాపారసంస్థలలోనూవున్న వుద్యోగాలకోసం చేసే కరెస్పాండెన్సంతా యీ అరల్లో వుంటుంది. ఈ మధ్యనే తన పరిశోధనలకు మరో అలమరా కావాలని 'రిక్విజిషన్' పెట్టాడు. నెల జీతంలో మూడో వంతో నాలుగో వంతో యీ కరెస్పాండెన్సుకు కేటాయించాడు.

ఇతగాడి పేరు రామ్మూర్తి. ముమ్మూర్తులా 'బ్రూసు — సాలీడు' కథలోని 'బ్రూసు' మాదిరే వుంటాడన్నారు కొందరు. ఈ లోపల మరో వేపునుంచి మరో ఆలోచనాబడి (స్కూల్ ఆఫ్ థాట్) బయల్దేరింది. 'రామ్మూర్తి ముమ్మూర్తులా బ్రూసు మాదిరుంటాడన్నదానికి మేం వప్పుకోం' అన్నారు వీళ్లు.

'ఎందుకని?' అని నిలవేశారు మొదటి వాళ్ళు. నిజంగానే నిలవేశారు. ఇలాంటి ఇన్‌స్టిట్యూట్లలో పదిన్నర ప్రాంతంలో కాఫీలకని కట్ట కట్టుకుని జట్లుగా బయల్దేర్తారు మనుష్యులు. తాబేలు తాతల మాదిరి నడుస్తూ చర్చించుకుంటూ వుంటారు. చర్చ పరాకాష్ఠనందుకుంటే నిలిచిపోయి వాదించుకుంటూ వుంటారు.

'రామ్మూర్తి ముమ్మూర్తులా బ్రూసు మాదిరుంటాడని మేమంటే మీరెందు కొప్పుకోరు' అని జట్టు సంతటినీ రోడ్డు ప్రక్కన గట్టు మీద నిలవేశారు మొదటి వాదం లేవదీసినవాళ్ళు. ఇలా నిలవేసేందుకు వీలుగా బోల్డు వాదాలు నిలవజేసుకుంటారీ జట్లలోని సభ్యులు.

'ఎందుకనేముంది? మీరు బ్రూసెట్లా వుంటాడో చూసినట్టు 'రామ్మూర్తి బ్రూసు పోలిక' అని చెప్పారు. మీరు బ్రూసుని చూశారా?' అన్నారు రెండో గ్రూపువాళ్లు.

'పోనీ మీరు బ్రూసుని చూశారా?' అన్నారు మొదటి గ్రూపువాళ్ళు.

'లేదు' అంది రెండో గ్రూపు.

'అలాంటప్పుడు మేం రామ్మూర్తిని బ్రూసుతో పోలిస్తే మీరెలా అభ్యంతరం చెప్పగలరు?' అన్నది మొదటి గ్రూపు.

రెండో జట్టు కాస్సేపు మాట్లాడే కుండా తర్వాత—

'రామ్మూర్తసలు బ్రూసు కాదు' అన్నది.

'మళ్ళీ అదేం మాట...యింతకు ముందు బ్రూసు పోలికలో లేడన్నారు. ఇప్పుడసలు బ్రూసు లక్షణాలే లేవంటారా ? ఇదేం మాట ?!' అన్నది మొదటి గ్రూపు.

'అవును ... రామ్మూర్తసలు బ్రూసు కాదు...అతగాడా కథలోని సాలీడు' అన్నారు ...దీనికి 'సాలిడ్' సపోర్టుందని వాదించారు. ఇందుకు తగిన సాక్ష్యం మరో యేడాదికల్లా చూపిస్తాం అన్నారు. ఆ మాట మీద నిలబడి, నిలబడినచోటు వదలి కాఫీక్లబ్ వేపు బయల్దేరారు. కాఫీ క్లబ్‌నుంచి డిపార్ట్‌మెంటుకొచ్చి పోస్టు చూసుకుని యిళ్ళకు పోతారు. ఇదీ వాళ్ళ దినచర్య.

ఇలా ఫారిన్ ఛాన్స్‌కోసం ప్రయత్నిస్తున్న రామ్మూర్తి డిపార్ట్‌మెంట్‌కే పద్మనాభం వచ్చాడు. సహజంగానే రామ్మూర్తి పద్మనాభం దగ్గిరకు చాలాసార్లు వెళ్ళాడు; ఈ మధ్యనే పద్మనాభానికి దగ్గిరయ్యాడు.

రామ్మూర్తి గారిలా రిసర్చి స్కాలర్ రూంలోకొచ్చి మళ్ళీ 'షీయూ లేటర్' అంటూ తిరిగెళ్ళిపోయాడు. సరాసరి పద్మనాభం రూముకు బయల్దేరాడు. పద్మనాభానికింకా ఇన్‌స్టిట్యూట్‌వాళ్ళు క్వార్టర్సివ్వలేదు. క్వార్టర్సు వచ్చేంతవరకూ హాస్టల్లో ఒక గెస్ట్‌రూం తీసుకుని దాంట్లో వుండటానికి నిశ్చయించుకున్నాడు. ఇప్పుడు దాంట్లోనే వున్నాడు. రామ్మూర్తక్కడికే బయల్దేరాడిప్పుడు.

పద్మనాభం రూంలో కూర్చుని డ్రస్ చేసుకుంటున్నాడు. ట్రై బిగించి ఒక చిన్న ఆల్బమ్‌లాంటిది తీసి ఒకసారిచూసి లోపల పెట్టేశాడు. ఫోటోలు, ఫోటోల పుస్తకాలు చాలామందికి చూపించాడుగానీ యిది మాత్రం యెవ్వరికీ చూపించలేదు. 'దాంట్లో యేమున్నయ్యా?' అని అందరికూ అనుమానం. ఫారిన్‌లో యేదో గ్రంథం నడిపాడేమో ననుకున్నారు; దానా ఒకా బొమ్మలన్నారు. ఇంతలో వకాయన ముందుకొచ్చి—

'అదేంకాదు; అందులో ప్రొఫెసర్ ఖొరానా, ప్రొఫెసర్ చంద్రశేఖర్ ... యింకా నార్లికార్ మొదలైనవాళ్ళ ఫోటోలుంటయ్. ఫారిన్‌నుంచి తిరిగొచ్చినవాళ్ళ

# ఫారిన్...

లేవంగానే వాళ్ల ఫోటోలకు దండం పెట్టి ఓ దండవేసి మరీ బయటకొస్తారు. మరి వాళ్ల మూలంగానే కదా ఫారిన్ వెళ్ళొచ్చిన మిగతావాళ్లకు విలువ. ఖొరానా అమెరికా వెళ్లి అంతపెద్దవాడు కావటం వాళ్ల దృష్టం. నార్లికార్ ఇంగ్లండ్ వెళ్లి అయిన్‌స్టీన్ సిద్ధాంతంమీద రాద్ధాంతం చెయ్యటం వాళ్ళు చేసుకున్న పుణ్యం. చెట్టు పేర్చెప్పి కాయలమ్ముకోవటం అందువల్లే సాధ్యమయ్యింది' అన్నాడు.

'పద్మనాభం ప్రణామాలన్నీ గావించి ప్రయాణమవ్వబోతూ వేసుకున్న కోటు భుజంమీద నలిగివుండటం చూసి వో చిన్న అయిరన్‌బాక్సు తీసి కోటు విప్పకుండానే కోటుమీద తోముకోవటం మొదలెట్టాడు. సరిగ్గా ఈ సమయంలోనే రామ్మూర్తి తలుపు తట్టాడు; తలుపు బోల్టువూడి గదిలోకి వూడిపడ్డాడు రామ్మూర్తి.

'ఏమిటి? భుజాలకు కాపటం పెట్టుకుంటున్నారా?! నేననుకుంటూనే వున్నాను. మీ భుజాలు కలుక్కుమంటూ వుంటయ్యని. ఈ మూణ్ణెల్లూ భుజాలు మరీ విపరీతంగా యెగరేశారు. అందుకే యిలా అవస్థొచ్చింది' అన్నాడు.

అవీ యివీ మాట్లాడి 'మళ్ళీ అమెరికా వెళ్ళిపోదామనుకుంటున్నాను' అన్నాడు పద్మనాభం.

'ఈమాటు మీరెళ్ళేటప్పుడు మీ లగేజిలో నన్ను వేసి తీసికెళ్ళిపోండి గురూ గారూ!' అన్నాడు రామ్మూర్తి.

'ఏంవిటండీ అట్లా అంటారు ? మీ కమెరికా వెళ్ళే ఛాన్సొస్తుంది లెండి' అన్నాడు పద్మనాభం.

'ఏమోనండీ...అమెరికాలో అవకాశాలు తగ్గిపోతున్నయ్యండీ...వియత్నాం యుద్ధంవల్ల ఫండ్సన్నీ అటువేపు వెడుతున్నయ్; అమెరికాలోని యూనివర్సిటీలకు సరిగా ఫండ్సందటంలేదు. అడ్మిషనిస్తున్నారు గానీ ఫైనాన్షియల్ అసిస్టెన్సు రావటంలేదు. ఈ యుద్ధం ఆగిపోతే బాగుండును' అన్నాడు రామ్మూర్తి.

'ఆగినా గొడవేనండోయ్ ... వియత్నాంనుంచి అమెరికన్ సైనికులు యింటికి వెళ్ళిపోయినా గొడవే ... వాళ్ళవల్ల బయట వాళ్ళ కమెరికాలో వుద్యోగాల్దొరకవ్. .' అన్నాడు పద్మనాభం.

'అయితే వియత్నాం యుద్ధం ఆగినా ఆగకపోయినా మనకిబ్బందేనన్న మాట...ఎట్లాగండీ చచ్చేది ? చచ్చేలోగా అమెరికా యెట్లా వెళ్ళేది ?... ఈ బంగ్లాదేశ్ వ్యవహారంవల్ల కూడా అమెరికాలో మనకు అవకాశాలు తగ్గిపోతున్నట్టున్నయ్...అక్కడివాళ్ళే యిండియాను ఛీకొడుతున్నారు. ఇంక నేను వెళ్ళేదెప్పుడో' అన్నాడు రామ్మూర్తి నిట్టూర్పుస్తూ.

# కోప్రా కిచిడీ

కావలసినవి:—

| | |
|---|---|
| బియ్యం | —2 కప్పులు |
| కొబ్బరి పాలు | —4 కప్పులు |
| శనగ పప్పు | —¼ కప్పు. |
| పెసర పప్పు | —¼ కప్పు. |
| నెయ్యి | —¼ కప్పు. |
| ఉల్లి గడ్డలు | —2. |
| పచ్చి కొబ్బరి | —ఒక ముక్క. |
| పసుపు | —చిటికెడు. |
| కారం | —ఒక స్పూను. |
| ఉప్పు | —తగినంత |
| సోపు గింజలు | —ఒక స్పూను. |

తయారుచేసే పద్ధతి:—

బియ్యం శుభ్రపరచి కడిగి పెట్టుకోవాలి. ఉల్లి గడ్డలు ముక్కలుగా తరగాలి. కొబ్బరి కోరి పెట్టుకోవాలి.

పొయ్యిపైన మందంగా ఉన్న గిన్నెపెట్టి నెయ్యివేసి పోపుచేసి (తాలింపు చేసి) దానిలో ఉల్లిగడ్డ ముక్కల్ని వేసి దోరగా వేయించాలి. దాన్లోనే శుభ్రపరచిన శనగ పప్పు, పెసర పప్పులను వేసి, పచ్చి కొబ్బరి కోరుకూడా వేసి వేయించాలి. కాస్త వేగిన తర్వాత కొబ్బరి పాలుపోసి ఉప్పు కారం, పసుపు (కావాలను కుంటేనే పసుపు వేసుకో వచ్చు.) వేసి కలిపి బియ్యంకూడా వేసి మంచిగా ఉడికిన తర్వాత దింపెయ్యాలి. వేడిగా తింటే కోప్రాకిచిడీ, చాలా బావుంటుంది.

ఈ కోప్రా కిచిడీ, చక్కని బలకరమైన ఆహారము. నోటి దుర్గంధము దంతరోగములు, కఫరోగాలు, వాత గుల్మలు, కలరా, వాంతులు మొదలగు రోగాలను పోగొట్టడమే గాక దేహ పుష్టినీ, చల్లదనాన్నీ, వీర్యపుష్టినీ కలిగిస్తుంది. నీరసత్వాన్ని, అలసటనీ తీర్చి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది 'కోప్రా కిచిడీ'.

—మూర్తి శ్రీ జయ సౌజన్య

'అన్నట్టి మధ్య ఆస్ట్రేలియాలో యూనివర్సిటీ టీచర్సుకు జీతాలు పెంచార్ట. దాంతో ఇంగ్లండ్ వాసులు ఆస్ట్రేలియా పట్ల మోజు చూపిస్తున్నార్ట...ఇక మనకు ఆస్ట్రేలియాలో కూడా రాదేమో ... కెనడా నకటే మిగిలుంది...ఏవీ లేకపోతే ఆఫ్రికా ఖండంలో యెక్కడికయినా నేను సిద్ధమే... అక్కడ మాత్రం యెక్కడొస్తుంది నాలాంటివాడికి...' అన్నాడు మళ్ళీ నిట్టూరుస్తూ.

'ఇవన్నీ వుంటూనే వుంటయ్ గానీ మీరో పన్చెయ్యండి. అమెరికాకు ఇమ్మిగ్రేషన్ కన్సల్ట్ చెయ్యండి ... కావాలంటే అక్కడున్న మా స్నేహితుడ్చేత 'అఫిడవిట్' యిప్పిస్తాను' అన్నాడు పద్మనాభం.

'అయితే మద్రాసువెళ్ళి అమెరికన్ కాన్సులేట్‌లో అప్లికేషన్ తీసుకొని యిచ్చొస్తాను' అన్నాడు రామ్మూర్తి.

'అబ్బే...మీరెందుకు వెళ్ళటం? ఉత్తరం రాయండి; అప్లికేషన్ పంపిస్తారు. తర్వాతెట్లాగో మీరు పర్సనల్‌గా వెళ్లాలనుకోండి' అన్నాడు పద్మనాభం.

మరునటివారం మద్రాసెళ్ళి అప్లికేషన్ నిచ్చి కొంత ఫీజుకూడా కట్టొచ్చాడు రామ్మూర్తి. అప్పటిగ్గానీ నిద్రపట్టలేదతగాడికి...

భుజాన బాగ్ తగిలించుకుని చెయ్యూపుతూ విమానం వేపు బయల్దేరాడు రామ్మూర్తి. మిత్రులందరూ వెనకనుంచి చెయ్యూపుతున్నారు ... చివరిసారిగా చెయ్యూపి లోపలికెళ్ళిపోయాడు రామ్మూర్తి. విమానం బయల్దేరింది ... కొంతసేపటికి ఎయిర్‌హోస్టెస్ హడావిడిగా పరుగెత్తింది. కానీ యేం మాట్లాడలేదు. వెనక్కీ వెనక్కీ చూస్తుంటూ భయంగా తన పనుల్జేసుకు పోతోంది. ఆమె వెనకాలే యింతవరకూ వెనకాల సీట్లో కూర్చున్న ప్రయాణీకుడు జేబులో చెయ్యి పెట్టుకుని తిరుగుతున్నాడు. రామ్మూర్తి తనుకూడా సరదాగా ఎయిర్ హోస్టెస్ వెనకాల తిరుగుదామా అనుకున్నాడు. ఇంతలో వక అనౌన్సుమెంటొచ్చింది: 'మన విమానం దిగబోతోంది ... బెల్టులు పెట్టుకోండి ...' అని. విమానం దిగింది. కానీ

# ఫారిన్...

ప్రయాణీకులను క్రిందకు దిగనివ్వలేదు. విమానం నడిపేవాళ్ళని దిగనివ్వలేదు. ఇంతవరకూ ఎయిర్‌హోస్టెస్ వెనకాల తిరిగినవాడు క్రిందకు దిగాడు. మరొకతనొచ్చి రివాల్వర్ పట్టుకుని తలుపుదగ్గిర నిలబడ్డాడు. ప్రయాణీకుల్లో గుసగుసలు బయల్దేరినయ్. ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని అరవకుండా కూర్చున్నారు. 'విమానం దిగినచోటు బొంబాయి మాత్రం కాద'ని గ్రహించారు. దాంతో గుండెలు వేగంగా కొట్టుకోవటం మొదలెట్టినయ్. అందరూ భయపడుతూ బాధపడుతుంటే రామ్మూర్తి మాత్రం చాలా సంతోషంగా వున్నాడు. ఈ సంతోషంలో డోర్దగ్గిర నిలబడ్డ వాడ్దగ్గిరకెళ్ళి షేక్‌హ్యాండిచ్చాడు. అతగాడు రామ్మూర్తేదో చెయ్యబోతున్నాడని భయపడి రామ్మూర్తినో తోపు తోశాడు. రామ్మూర్తి క్రింద పడి లేచి మళ్ళీ వాడ్దగ్గిర కెళ్ళకుండా దూరంగా నిలబడి—

'మనమిప్పుడు ఫారిన్ దేశంలో వున్నాం కదూ?' అన్నాడు,

'హూఁ' అన్నాడు వాడు.

'బాబ్బాబూ! ఏ దేశమో చెప్పు... రేపింటికెళ్ళాక నేం చెప్పుకోవాలి ... అప్లికేషన్లలో రాసుకోవాలి' అన్నాడు.

'చెప్పను' అన్నాడవతలివాడు.

'పోనీ యీ సంగతి చెప్పు...యిదిండియా కాదు కదూ?'

'కాదు' అన్నాడవతలివాడు.

రామ్మూర్తికి మహా సంతోషమయ్యింది ...కాస్సేపాగి—

'బాబ్బాబు ... నన్నొక్కసారి క్రిందకు దిగనిస్తారా?' అన్నాడు.

వాడేం మాట్లాడకుండా రివాల్వర్ చూపించాడు.

'కోప్పడకు బాబూ!...ఒక్కసారి యీ కాళ్ళు ఫారిన్‌దేశం మీద పెట్టి మళ్ళీ లోపలికొస్తాను...ఫారిన్ నేల మీద కాళ్ళు పెట్టినవాడి కాళ్ళు కడక్కుండా, వాణ్ణేం అడక్కుండా వుద్యోగాలిస్తారు మా దేశంలో ...బాబ్బాబు...వక్కసారి నన్ను క్రిందకు దిగనివ్వండి' అని వేడుకొన్నాడు.

ఇంతలో ముగ్గురు లోపలికొచ్చారు. వాళ్ళేదో చెప్పారు. డోర్దగ్గిర నిలబడ్డవాడూ సంతోషంగా వున్నాడు.

'మేమడిగింది మీ ప్రభుత్వం యిచ్చింది ...మేమింక పోతున్నాం. మీకు శ్రమ కలిగించినందుకు క్షమించండి' అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు.

రామ్మూర్తి—'బాబూ! యీ విమానాన్ని మరో దేశానికి హైజాక్ చెయ్యండి' అంటూ అరిచాడు.

తను పెట్టిన గావుకేకకు రామ్మూర్తికి మెలకువ వచ్చింది. 'ఛా...ఇది కలా?... ప్చ్' అంటూ మళ్ళీ పడుకున్నాడు. నిద్ర పట్టలేదు. లేచి ప్రక్క రూం వాణ్ణి లేపి 'యిందాక కల్లో ఫారిన్ వెళ్ళొచ్చాన'ని చెప్పొచ్చాడు. వాడేదో చెప్పొచ్చాడు గానీ రామ్మూర్తదేం వినిపించుకోకుండా యింకో రూం కెళ్ళాడు.

కొన్నాళ్ళ తర్వాత అదేదో దేశంలో ఒక మారుమూల కాలేజీలో టీచింగసిస్టెంటుద్యోగం రామ్మూర్తికిస్తామని రాశారు.

'ఇదెక్కడుందో తెల్సా?' అన్నాడు రామ్మూర్తి పద్మనాభంతో.

కాస్సేపాలోచించి — 'ఆఁ ... తెల్సుకోవటం అంతకష్టంకాదు' అన్నాడు పద్మనాభం.

డబ్బు అనుకున్నదానికంటె చాలా తక్కువొస్తున్నట్టు తోచి—

'ఫామిలీతో వెళ్ళటానికిది సరిపోతుందా?' అన్నాడు రామ్మూర్తి.

'ఫరవాలేదు. అయినా అదేదో మారుమూల దేశంలోని మారుమూల ప్రదేశం కదా... డబ్బు సరిపోవచ్చు ... ఒకవేళ సరిపోకపోయినా కొంచెం కష్టపడు మరి ... 'కష్టేఫలీ' అన్నారు. అక్కడ కష్టం గురించాలోచించకు ... యిక్కడ కొన్నాళ్ళ ఫారిన్ రిటర్న్డ్‌గా వచ్చే సుఖం సంగతేమిటి?' అన్నాడు.

'యూ ఆర్ రైట్' అని రామ్మూర్తి విమానం యెక్కాడు.

(ఇంకా ఉంది)



# ఫారిన్ రిటర్న్డ్ లేక స్వదేశీ ఉద్యోగ పర్వాలకు అతీతులు

లేళ్ళపల్లి వెంకటలక్ష్మినారాయణ



## నాలుగో కథ
## స్కాలర్లు-డాలర్లు

పద్మనాభం ఆ డిపార్ట్‌మెంట్‌లో చేరి ఆర్నెల్లయ్యింది. ఆ డిపార్ట్‌మెంట్‌లోని ఫారిన్ రిటర్న్డ్ స్టాఫ్ మెంబర్సుతో తిరుగుతూ 'మనమందరం ఒక అసోసియేషన్ పెడదాం' అంటూ వుండేవాడు. ఇలాంటివాళ్ళో నలుగురున్నారా డిపార్ట్‌మెంట్‌లో. పద్మనాభంతో కలిసి అయిదుగురు వీళ్ళు. (వీళ్ళుగాక మరొకాయనున్నాడు. ఈయన సిసలైన ఫారిన్ రిటర్న్డ్. పైవారం కథలో వస్తాడు) వీళ్ళయిదుగురూ కలిసి మాట్లాట్టం చూట్టానికి బావుంటుంది. ఫారిన్ వెళ్ళని వాళ్ళని గురించి చెప్పుకోవటంలో వీళ్ళందరూ ఒకేమాట మీదుంటారు. ఒకేపాట పాడ్తారు. కానీ తను వెళ్ళొచ్చినదేశం, తను చదివిన యూనివర్సిటీ చాలా గొప్పదని ప్రతివాడూ అంటాడు. దీంతో భేదాభిప్రాయాలొచ్చి టాపిక్ స్వదేశీ చదువులమీదకు మళ్ళించి, డిపార్ట్‌మెంట్‌లోని స్వదేశీ పిహెచ్.డీల గురించి మాట్లాడ్తారు.

ఈ నలుగుర్లో వో సుబ్రహ్మణ్యం వున్నాడు. సుబ్రహ్మణ్యం అదేదో దేశానికి— ఇంగ్లీషు మాతృభాష కాని దేశానికి— మూణ్ణెల్లు వెళ్ళి వచ్చాడు. ఈ మూణ్ణెల్లల్లోనూ ముప్పయ్ సంవత్సరాల చదువు చదివానంటాడు. ఇలాంటి 'షార్ట్ అసైన్‌మెంట్లు' కొన్నిదేశాలు యిస్తున్నయ్. వాళ్ళిచ్చే అవకాశం మూడునెలల్నుంచీ తొమ్మిది లేదా పన్నెండు నెలల్దాకా వుంటుంది. ఇలాంటి దేశంనుంచి మూణ్ణెల్లు వచ్చి చూసి వెళ్ళకొమ్మని సుబ్రహ్మణ్యానికో వుత్తరం వచ్చింది. ఉత్తరం యింగ్లీషులో గాకుండా ఆ దేశపు భాషలో వుంది. సుబ్రహ్మణ్యానికా భాష రాదు. ఆ వుత్తరం పుచ్చుకుని ఆ ఇన్‌స్టిట్యూట్‌లోని ఫారిన్ లాంగ్వేజెస్ సెక్షను కెళ్ళాడు— 'బాబూ! ఈ వుత్తరం కాస్త చదివి పెడతారూ!' అంటూ.


(వెంకటాపురంలో వుండే నారయ్య కూడా వెంకన్నపంతులుగారితో సరిగా ఈమాటే అంటాడు. కాకపోతే నారయ్య తెలుగులో రాసిన వుత్తరం తీసుకెడతాడు; సుబ్రహ్మణ్యం మరోదేశపు భాషలో రాసిన వుత్తరం తీసుకువెళ్ళాడు. అంతే తేడా... సుబ్రహ్మణ్యం ఆదేశం వెళ్ళాక ఆ దేశంలో నారయ్య మాదిరే వుంటాడు...తేడా యేం లేదు.)

అవతలాయన వుత్తరం చదివి క్రింద బెడితే సుబ్రహ్మణ్యం మళ్ళీ చదివి పెట్టమన్నాడు. మళ్ళీ చదివాక క్రిందపెట్టమన్నాడు. ఈసారి యింగ్లీషులోకి చేసిన తర్జుమాని కాగితంమీద రాసుకుని 'ఫారిన్ ఛాన్సొచ్చింది' అంటూ యెగిరిపోయాడు. ఎగుర్తూనే డిపార్ట్‌మెంటుకు వెళ్ళాడు. వచ్చేటప్పుడు యింత సంతోషంగా రాలేదు. ఉత్తరంలో రమ్మనమని రాశారో, వద్దని రాశారో తెలియలేదు సుబ్రహ్మణ్యానికి. ఇలాంటి సుబ్రహ్మణ్యం ఆ దేశంలో ట్రయినింగ్‌కు వెళ్ళాడు.

ఆ దేశంవెళ్లి మూణ్ణెల్లల్లో ఆ భాష లోని కొన్ని మాటలూ, రెండుమూడు వూత వాక్యాలూ నేర్చుకునే వేళ్టికి—

'అబ్బాయీ! మూణ్ణెల్లూ అయి పోయింది ... ఇహ నిండియాకు వెళ్ళు' అన్నారు.

సుబ్రహ్మణ్యం నవ్వుతూ నిలబడ్డాడు. వాళ్ళు చెప్పింది అర్థంకాలేదు సుబ్రహ్మణ్యానికి. ఇతగాడితో యిట్లా లాభంలేదని వాళ్ళు ప్లేన్ టికెట్టుకొని తీసుకొచ్చి సుబ్రహ్మణ్యాని కిచ్చారు. అప్పటి కర్థమయ్యింది వాళ్లేం చెప్పారో సుబ్రహ్మణ్యా



# ఫారిన్ ...

విక్. అతగాడు తన సబ్జక్టుమీద చేసింది గానీ, చూసిందిగానీ యేంలేదు; విన్నదసలే లేదు. అయినా ఫారిన్ వెళ్లానంటాడు. విదర్శనంగా వక టేప్‌రికార్డర్, వక కెమేరా పుచ్చుకొచ్చాడు.

ఇండియాలో వక వ్యక్తి పట్టభద్రుడైనప్పుడు పొట్లాంలాంటి కాగితాన్ని పట్టుకుని ఫోటో తీయించుకుంటాడు. అది ఆచారం. అతగాడికి 'పట్టా' వచ్చిందని నిరూపించుకునేందుకా ఫోటో యింట్లో కట్టుకుంటాడు; పేరు చివర్న డిగ్రీ పెట్టుకుంటాడు. ఇవన్నీ తనకు డిగ్రీ వచ్చిందని తెలియజేసేందుకు సాక్ష్యాలు. కానీ ఫారిన్‌నుంచి వచ్చినవాళ్లు తాము ఫారిన్ వెళ్లినట్టు తెలియజేసేందుకు కెమెరాలు, ఎలక్ట్రిక్ గాడ్జెట్లు, టేప్ రికార్డర్లు — యిలాంటి సామాన్లన్నీ తెసుకొస్తారు. విదేశీ డబ్బు బాగా వున్న వాళ్లు యింకా పెద్ద వస్తువులెత్తేస్తారు. ఎంత విలువైన సామాన్లు తెస్తే అంత 'పెద్ద' ఫారిన్ రిటర్న్డ్‌గా చలామణీ అవుతాడు. అందుకని ప్రతివాళ్లూ యీ తాపత్రయంలోనే వుంటారు. స్థూలంగా చెప్పాలంటే ఫారిన్ రిటర్న్డ్ విలువ అతగాడు తెచ్చే డాలర్ల మీద లేదా డాలర్లకు సమానమైన వస్తువుల మీద ఆధారపడి వుంటుంది. (విదేశీ కరెన్సీకి మారుపేరుగా 'డాలర్' ను వుపయోగించాను. మొన్నిమధ్య దాకా వివిధదేశాల కరెన్సీలలో డాలర్ 'గట్టి'దన్న నమ్మకం అందరికీ వుంది. ఇప్పటికీ ఆ నమ్మకం—కొంచెం ఆ మధ్య సడలినా—వుంది—రచయిత.)

'క్రిందటి తడవ వెళ్లినప్పుడు కొన్ని కొనలేదు. ఈసారి వెళ్లినప్పుడు తీసుకు రావాలి' అంటార్తప్ప 'ఈసారి వెళ్లినప్పుడు ఫలానా విదేశీ ప్రొఫెసర్దగ్గిర నేర్చుకుంటాననీ, ఫలానా యూనివర్సిటీలో చేర్తాననీ' అనేవాళ్ళు చాలా తక్కువ.

మూణ్ణెల్లు యిండియా బయటున్న సుబ్రహ్మణ్యం కూడా తిరిగొచ్చిందగ్గర్నుంచీ విసుక్కోటం మొదలెట్టాడు— 'ఫారిన్ వెళ్లొచ్చి నెలయింది; యింతవరకూ ప్రమోషన్సంగతి మాట్లాడరు. తిరిగి రాకుండా వుండాల్సింది; పొరపాటయిపోయింది' అంటూ.

తిరిగొచ్చిన రెండు నెలల కతగాడికి ప్రమోషనిచ్చారు. నెలరోజులాలిశ్యం అయినందుకు నానా రభసా చేశాడు; ప్రొఫెసర్ లాలించినా గోల పెడుతూనే వున్నాడు. 'నాలాంటివాడు దేశం మొత్తం గాలించినా మీకు దొరకడ'ని భయపెట్టాడు.

ఈ అయిదుగుర్లో మరొకాయనున్నాడు. ఆయన ఫారిన్‌లో యేంజేశాడో దేవుడికీ, ఇన్‌స్టిట్యూట్‌లోని పెద్దాయనకూ తెల్సునని అందరూ అభాండాలు వేశారు. కానీ ఆయన చాలా కష్టమైన పనులు సాధించాడు. ఫారిన్ వెళ్ళకపోతే అవి సాధించగలిగేవాణ్ణిగానని యిప్పటికీ తనలో తాను చెప్పుకుంటాడు. బయటకు చెప్పుకోవటం ఆయనకిష్టం లేదు. ఇంతకూ ఆయన సాధించినది యిది: ఫారిన్ వెళ్ళి తన భార్యనో రచయిత్రిని చేశాడు. ఫారిన్‌నుంచి బోల్డు వుత్తరాలు, కొన్ని వ్యాసాలు యిండియాలోని వార, మాస పత్రికలకు పంపిందావిడ. ఈవిడ ఆ దేశం వెళ్లంగానే 'మా శ్రీవారి ఫలానాదేశపు ప్రయాణం' అని వక వ్యాసం, తర్వాత 'తదుపరి నా ప్రయాణం' అని మరో వ్యాసం రాసి పంపింది. 'భారతదేశానికీ యిక్కడకూ ఆచారవ్యవహారాల్లో యెంతో తేడా' అంటూ మొదలుపెట్టి 'కానీ అలవాటుపడటమేమంత కష్టం గాదు' అని ముగించేది. ఆయన యీ ఇన్‌స్టిట్యూట్‌లో చేరి యిక్కడొక మేగజైన్ స్థాపింపజేసి దానికి వాళ్ళావిణ్ణి ఎడిటర్‌చేసి తనూ వో కథ రాశాడు. ఈ తతంగంలో చేతిఖర్చు కొంతయ్యిందని కూడా అంటారు.

ఈ గ్రూపులో మరొకాయనున్నాడు. పేరు విష్ణుశర్మ. ఈయన ఫారిన్ వెళ్ళి తిరిగొచ్చిం దగ్గర్నుంచి డిపార్ట్‌మెంట్‌లో కూర్చుని కులాంతర, దేశాంతర వివాహాల గురించి వాటి ఆవశ్యకతను గురించి మాట్లాడుతున్నాడు. సబ్జక్టు గురించి దాంట్లో రిసర్చి గురించి నోరు మెదపడు. పైన చెప్పిన వివాహాల గురించి మాట్లాడటం వెనకాలో కథుంది.

పూర్వం రాజులు తమ కుమారులకు రాజ్యం అప్పగించే ముందు దేశాటన చేసి లోకజ్ఞానం సంపాదించుకురమ్మని వారిని దేశం బయటకు పంపేవారు. వాళ్ళలా తిరిగి తిరిగొచ్చేముందు వక్కొక్కరూ వో యిద్దరు ముగ్గురు రాజకుమార్తెలను పెళ్లి జేసుకొచ్చేవారు. ఆ సంప్రదాయాన్ననుసరించే యీ రోజుల్లో ఫారిన్ వెళ్లేవాళ్లలో



కొంతమంది వెళ్లిన దేశంలోని పిల్లల్ని పెళ్లి జేసుకొంటున్నారు. విష్ణుశర్మ చేసింది లాంటి పనేగానీ యీ పని కాదు. అతగాడక్కడికెళ్లి అక్కడ కొచ్చిన మరో భారతీయ యువతిని పెళ్లాడాడు. 'ఇదేంపని... చెడినవ్రతమేదో యెట్లాగో చెడింది... హాయిగా అమెరికన్ పిల్లని పెళ్లిచేసుకో' మని స్నేహితులు సలహా యిచ్చారు. సలహాలు వినేవేళ్టికే విష్ణుశర్మ చాలా దూరం వెళ్లాడు, అందుకని 'లాభంలేదు' అన్నాడు. అందు కనతగాడికి 'స్వామి' అని పేరు పెట్టా రతగాడి స్నేహితులు. ఆర్కె నారాయణ్ రాసిన 'స్వామి అండ్ ఫ్రెండ్స్' లో పరీక్షలయ్యాక స్నేహితులందరూ ఒకరిమీదొకరు సిరాలు చల్లుకుంటుంటే స్వామి తన సిరా బుడ్డెత్తి తనమీదే సిరా పోసుకుంటాడు. ప్రక్కవాళ్లమాదిరి చెయ్యాలని వుబలాటం; చేసేందుకు ధైర్యంలేక 'సూక్ష్మంలో మోక్షం' అన్నట్టు యిలాంటిని చేసి తృప్తిపడటం దీనికి కారణం కావచ్చు. దీన్ని మనస్తత్వ శాస్త్రజ్ఞులేమంటారో తెలియదుగానీ యిదే 'స్వామి'కీ 'విష్ణుశర్మ'కూ గల పోలిక అన్నారు విష్ణుశర్మ స్నేహితులు ... విష్ణుశర్మ యీ పన్చెయ్యటంతో అతగాడికేం లాభం కలిగిందోగాని యిండియాలో వున్న అతగాడి వాళ్లకు మాత్రం లాభించింది. వాళ్ల చుట్టాల్లోనూ స్నేహితుల్లోనూ, యిలా చెప్పే వాళ్లు.

'మా విష్ణుశర్మ అమెరికాలో పెళ్లి జేసుకున్నా మనవాళ్లమ్మాయినే వివాహం చేసుకున్నాడు; వాళ్లదీ మనశాఖే. అమెరికా వెళ్లి పెళ్లి మేమే చేయించాం. పెళ్లి అమెరికాలో జరిగినా బీజం మంచిది కాబట్టి వంశమర్యాదలు మంటగలవలేదు' అని.

స్నేహితుల్లోనూ, చుట్టాల్లోనూ యిలా చెప్పేముందు ఆ అమ్మాయిని వొదిలెయ్యమని విష్ణుశర్మకు హితబోధ చేశారు. కాని విష్ణుశర్మ వినలేదు. అందుకతగాణ్ణి అభినందించాల్సిందే ... ఫారిన్‌నుంచి తిరిగొచ్చాక విష్ణుశర్మ యింతవరకూ యిలాంటి వివాహాల ఆవశ్యకత గురించి చెబుతున్నాడు.

ఈ అయిదుగుర్లో మరొకాయనున్నాడు; పేరు ప్రేమ్‌చంద్. ఉత్తర హిందూస్థానంలోని యూనివర్సిటీలో ఎం. ఏ.



నమ్మకమైన
ఐటెక్స్
సౌందర్య సాధనములు
నా కిష్టం, నేను వాటినే ఉపయోగిస్తాను
జయకౌసల్య




ARAVIND LABORATORIES,
MADRAS-33

డిగ్రీ తీసుకుని ఆర్నెల్లో తొమ్మిది నెలలో అమెరికాలో వుండి ఒక డిగ్రీలాంటిది తీసుకొచ్చాడు. ఇప్పుడతగాడు తనపేరు వెనక నున్న యిండియన్ డిగ్రీని తుడిచేసి తొమ్మిదినెలల అమెరికన్ డిగ్రీనే తగిలించుకున్నాడు. ఆ డిగ్రీప్రక్కన బ్రాకెట్టులో యూనివర్సిటీ పేరుకూడా రాస్తాడు. ఈ తొమ్మిదినెలల డిగ్రీ గురించి రోజుకో తొంభైతడవల్జెప్పతాడు. ఇండియన్ పిహెచ్. డి. కంటె కూడా యీ తొమ్మిది నెలల డిగ్రీ యెన్నోరెట్లు యెక్కువంటాడు. ఈ తొమ్మిదినెలల డిగ్రీకి తొమ్మిది యింక్రిమెంట్లు, మూడు ప్రమోషన్లు రాలేదని చాలా బాధపడతాడు. ఈబాధ ల్చెప్పతూ చుట్టుపక్కల వాళ్లని బాధ పెడతాడు. రోజులో యెక్కువభాగం వచ్చిన ఫారిన్ డిగ్రీ గురించి రాని ప్రమోషన్ల గురించి మాట్లాడ్తాడు. అప్పుడు చాలా


సంపూర్ణ ఆరోగ్యం పొందండి



శాస్త్రీయ పద్ధతిలో శస్త్రచికిత్స లేకుండా పూర్తి ఆరోగ్యాన్ని పొందుటకు సెక్సు స్పెషలిస్టు (గుప్త రోగ నిపుణులు) ను సంప్రదించండి. (22 సంవత్సరాల అనుభవం) డా॥ రాయ్ (గవర్నమెంటు రిజిస్టర్డు) వీరవము, వరముల బలహీనత, చికిత్స ద్వారా నయం చేసుకుని మీ వైవాహిక జీవితాన్ని సుఖవంతం చేసుకోండి. వరముల బలహీనతను మందుల ద్వారానేకాక ఎల్క్ట్రిక్ చికిత్సవల్లకూడా నయంచేయబడును.

సంప్రదించు వేళలు : ఉ. 8.00 నుండి 1.00వరకు సా.4.00నుండి రా.9.30వరకు

ఆంధ్రప్రదేశ్‌లో 1950 లో స్థాపితము.

**రాయ్ మెడికల్ హాల్**

బ్రాంచి ఆఫీసు : మొదటి అంతస్తు, గాంధీనగరం, అలంకార్ టాకీస్ ఎదుట, విజయవాడ—3. ఫోన్ : 74658.

హెడ్ ఆఫీసు : మొదటి అంతస్తు, సెయింట్ మేరిస్‌రోడ్, మనోహర టాకీస్‌వద్ద సికింద్రాబాద్ (ఫోన్ 72184)


# ఫారిన్...

ఎమోషనల్‌గా వుంటాడు. ఇతగాడు ఆ డిపార్ట్‌మెంటు నుంచొచ్చే ఒక మేగజైన్ లాంటి జర్నల్‌కు పేపర్లంటూ రెండు పుస్తకాల్లోంచి యెత్తి రాస్తూ వుంటాడు. వాటిని పేపర్లని అందరూ నెత్తిమీద పెట్టుకోవాలంటాడు. మిగతావాళ్లు రాసేది చెత్తంటాడు పైగా. ఆ మేగజైన్‌కు పేప ర్రాసిచ్చేటప్పు డతగాడ్చేసే హంగామా చూడాలి. తనిచ్చే ఆ 'పేపర్' అమెరికన్ యూనివర్సిటీలో కూర్చుని రాశానంటాడు, అమెరికాలో కొన్న పేపరుమీద రాశానంటాడు. ఈ రెండు విషయాలవల్ల ఆ పేపరు గొప్పదంటాడు. ఆ మేగజైన్లో పడ్డవాటి 'రీప్రింట్'తీసి డిపార్ట్‌మెంట్‌లో అందరకూ యిస్తాడు. ఫారిన్‌వెళ్లి రానివాళ్ల కిచ్చి 'చదువుకుని బాగుపడండి' అంటాడు. ఫారిన్ వెళ్లొచ్చిన వాళ్లకిచ్చి 'చదివి మీ సలహా యివ్వండి' అంటాడు. ఫారిన్ రిటర్న్డ్ వ్యక్తులు సలహా లివ్వరు. వాళ్ళలో వో సుగుణం వుంది. ఏ కాస్త పని వాళ్ళు చేసినా మరొకళ్ళు చెయ్యగా చూసినా బోల్డు సంబరపడిపోతారు. చేసింది అవతలివాడైతే వాడి చెయ్యి పుచ్చుకుని వూహూ మెచ్చుకుంటారు. ఈ సుగుణం అమెరికా వెళ్లి తిరిగొచ్చినవాళ్ళల్లో మరీ కనిపిస్తుంది.

ప్రేమ్‌చంద్ యిలాంటివాళ్లకి రీప్రింటిస్తూ—'ఇది రెండు రోజుల్లో రాశాను. యూనివర్సిటీ ప్రక్కనున్న నది గట్టునున్న చెట్టు కింద కూర్చుని రాశాను... సరిగ్గా వకటిన్నర రోజులు పట్టింది' అంటాడు.

'వండర్‌ఫుల్...జస్ట్ టు డేస్!!...ఇన్‌క్రెడిబుల్' అంటారు తోటివాళ్ళు.

ఈ లోపల మరో ఫారిన్ రిటర్న్డ్ తనకు ఫారిన్‌లోని చాలా యూనివర్సిటీలతో పరిచయం వుందని నిరూపించుకునేందుకు— 'మీరు కూర్చున్న నది మీద ఒక బ్రిడ్జి మొదలెట్టారు. 1970 లో అక్కడున్నాన్నేను. అప్పుడ్చూశాను. అది పూర్తయ్యిందా ?' అన్నాడు.

ఇతగాడు తన పేపర్సంగతి చెప్పనీకుండా అడ్డొస్తున్నాడని ప్రేమ్‌చంద్‌కు కోప మొచ్చింది. అయినా అడ్డొచ్చినవాడు అయినవాడూ, తోటివాడూ, ఒకే గూటి పక్షి అని గుర్తుకొచ్చి కొంచెం నెమ్మదిగానే —

'ఆ... పూర్తయ్యింది. సరిగా నేను పేపర్ పూర్తిజేసి నరోజునే ఆ బ్రిడ్జికూడా పూర్తయ్యింది. పేపర్ పూర్తిచేసి నేనూ ఆ బ్రిడ్జి మీద నడిచాను ... చాలా పెద్ద బ్రిడ్జి... బ్రిడ్జి మీద నడుస్తూ రాసిన పేపర్చదువుకున్నాను ... బ్రిడ్జి ఆ చివరకు వెళ్లేసరికి పేపర్చదవటం పూర్తయ్యింది' అన్నాడు ప్రేమ్‌చంద్.

'మార్వెలస్' అంటూ కళ్ళు తేలేసి మెడలు వేలాడేశారు మిత్రులు.

'కానీ ఆ నదివద్దున వింటర్లో చాలా చాలా చలిగా వుంటుందండి ... అయినా అక్కడ కూర్చోందే నాకు తోచేది కాదు. అందుకే స్పెషల్‌గా కోట్లు, గ్లౌవ్స్ కొనుక్కుని వెళ్లి కూర్చునేవాణ్ని ... ఆ కొన్నవిప్పుడు యిండియాకు తెచ్చుకున్నాను' అన్నాడింకొకాయన.

వీళ్లిమాటలనుకుంటూ వుండగా యిద్దరటువైపుగా వెళ్లారు. అందులో ఒకాయన మరొకాయనన్నుద్దేశించి—

'ఇదండీ వీళ్లతంతు...వాళ్లు కొనుక్కొచ్చిన వాటిగురించి చెప్పేందుకో అంతుండద్దండీ?' అన్నాడు.

అవతలాయన నవ్వాడు. నవ్వి—

'ఏమైతేనేం లెండి... ఇప్పుడు వాళ్లకు గిరాకి. అధికారులు మన విషయాల్లో పరాకు చూపిస్తారుగానీ వాళ్ల విషయంలో కాదే...ఎందుచేత నంటారు?' అన్నాడు.

'ఏమన్నారు? మళ్లీ అడగండి చెప్తాను' అన్నాడు మొదటాయన.

'ఏమైతేనేంలెండి ... ఇప్పుడు వాళ్లకు గిరాకి. అధికారులు మన విషయాల్లో పరాకు చూపిస్తారుగానీ వాళ్ల విషయంలో కాదే... ఎందుచేతనంటారు?' అన్నాడు అవతలాయన మళ్లీ.

'అక్కడాగండి చెపుతాను' అన్నాడు మొదటాయన.

మొదటాయనపేరు మోహన్రావు: ప్రశ్న మళ్ళీ మళ్ళీ అడిగించుకునిగానీ సమాధానం చెప్పడు. అట్లా చెప్పకపోతే అడిగినవాడికీ, అడగనివాడికీ చెపుతాడనే అప్రతిష్ఠ వస్తుందని భయం. అందుకని మళ్ళీ మళ్ళీ అడుగుతాడన్నారు కొందరు. అదేం రాదు; అతగాడు యేక సంథాగ్రాహి కాడు. అదీ అతగాడితో వచ్చిన చిక్కు అన్నారు మరి కొందరు. ఇదిప్పుడొచ్చిన జబ్బు కాదు; అతగాడు చిన్నప్పట్నుంచీ అంతే, నన్నారు. ఏమైనా మోహన్రావు ప్రశ్న మళ్ళీ మళ్ళీ అడిగించుకోటానికి మొహమాట పడడు.


మోహన్రావు మొదలెట్టాడు:

'పూర్వం విదేశాలు వెళ్ళి స్కాలర్షిప్ప సంపాదించుకుని స్కాలర్సుగా తిరిగిరండి' అని విదేశాలు పంపేవాళ్ళ కుర్రాళ్ళని. అందుకనా రోజుల్లో విదేశాల్నుంచి స్కాలర్సు తిరిగొచ్చేవాళ్ళు. అందుకని వాళ్ళకెంతో గౌరవం. వాళ్ళ అడుగులకు మడుగులొత్తే వాళ్ళు. వాళ్ళేదడిగితే అదిచ్చేవాళ్ళు. వాళ్ళ నడుగున పెట్టకుండా పదిమందీ కలిసి వో వందమంది పైకెత్తేవారు. ఫారిన్ రిటర్న్డ్కీ గౌరవం అప్పట్నుంచి వస్తోంది. ఈ మధ్యకాలంలో ఆ గౌరవం పోయి మరో గౌరవం వచ్చింది. దేశానికి విదేశీ ద్రవ్యంయొక్క ఆవశ్యకత యెంతైనా వుంది. విదేశాలకు వెళ్లి యిండియాకు విదేశీ మారకద్రవ్యం పంపేవాళ్ళంటే అంద రకూ ఆపేక్ష. అందువల్ల వాళ్ళంటే గౌరవం. వీళ్ళ ఫారిన్ వెళ్లి రావటంవల్ల స్కాలర్సు, డాలర్సు—రెండూ యిండియాకు దొరకొచ్చు; లేదా కనీసం డాలర్లన్నా దొరక్కపోవు...కానీ తిప్ప లెక్కడ మొద లయ్యెనయ్యంటే—స్కాలర్లక్కడ పౌరసత్వం తీసుకుని వుండిపోతున్నారు. మనం డాలర్లని లెక్కించేవాళ్ళని మాత్రం దక్కించుకుంటు న్నాం' అని అపాడు మోహన్రావు.

(ఇంకా వుంది)









# ఫారిన్ రిటర్న్డ్ లేక స్వదేశీ ఉద్యోగ పర్వాలకు అతీతులు

లేళ్లపల్లి వెంకటలక్ష్మీనారాయణ



అయిదో కథ

# మధ్యనిద్ర

పద్మనాభం గదిలో కూర్చుని నిద్ద రోతున్నాడు. ఆ క్రితం రాత్రి క్రొత్తగా వచ్చిన ఓ ఫారిన్ రిటర్న్డ్ విదేశీ పోనీయం యిచ్చి తెల్లవారేక గానీ రూముకు పోనీయలేదు. ఆ 'హేంగోవర్' యింకా పద్మనాభాన్నొదల్లేదు. ఆ ప్రొద్దున డిపార్ట్‌మెంట్ కొస్తూనే నలుగుర్తోనూ రాత్రి చేసిన ఘనకార్యం చెప్పాడు. ఫారిన్ రిటర్న్డ్ వాళ్లలోవున్న సుగుణాల్లో యిదొకటి, రాసిన పేపర్ల గురించి చెప్పినట్లే చేసిన అద్భుతాలసంగతి చెబుతాడు. ఫారిన్ వెళ్లని వాళ్లలా కాదే! మందు వేసుకున్నా పదిమంది ముందూ చెప్పరు, తప్పుచేసి నట్టు తలొంచుకూర్చుంటారు—'హేంగోవర్' పోయినాసరే.

ఇలా నిద్దరోతున్న పద్మనాభానికి ప్రొఫెసర్దగ్గర్నుంచి పిలుపొచ్చింది. ఆ మర్రోజున ఆ డిపార్ట్‌మెంట్‌లోకి తీసుకోబోయే రిసర్చి స్కాలర్ల సెలెక్షన్ జరగబోతోంది. ఎంతమందిని తీసుకోవాలో నిర్ణయించుకునేందుకుగ్గాను తన కొలీగ్స్‌తో అలోచిస్తానిగ్గాను ఒక్కొక్కళ్లనీ ప్రొఫెసర్ గారు పిలుస్తున్నారు. ప్రొఫెసర్ రావుగారు కూడా ఫారిన్ రిటర్న్డ్. కానీ యీయన సీనియరైన ఫారిన్ రిటర్న్డ్. రెండు మూడేళ్లకో తడవ ఫారిన్ వెళ్తూ వుంటాడు. రాగానే తన డిపార్ట్‌మెంట్‌లోని స్టాఫ్ నందర్నీ పిలిచి ఓ మీటింగు పెడతాడు. మీటింగ్‌లో తను వెళ్ళిన దేశాల్లో తను చూసొచ్చిన ప్రదేశాల్సంగతి చెప్పకుండా ఆయా యూనివర్సిటీల్లో సిలబస్ యెంత త్వరగా మారుస్తూ వుంటారన్న సంగతి, అలా మార్చాల్సిన ఆవశ్యకత గురించి, అక్కడ జరుగుతున్న రిసర్చి విషయాల గురించి వివరించి చర్చిస్తారు. వినేవాళ్లలోని ఫారిన్ రిటర్న్డ్ వ్యక్తులు మిగతా విషయాల గురించి కూడా ప్రొఫెసర్‌గారు చెబితే వినాలని ముచ్చటపడు తున్నట్టూ, అందువల్ల ఆ విషయాలు ముచ్చటించాలనీ సూచిస్తారు గానీ ప్రొఫెసర్ గారు 'అవి ప్రయివేట్‌గా మాట్లాడు కుందాం మీకంత మోజుగా వుంటే' అని నిక్కచ్చిగా చెప్పటంతో మాట్లాడకుండా కూర్చుంటారు.

పద్మనాభం సిగరెట్టు ముట్టించి ప్రొఫెసర్ యెదురుగా కూర్చున్నాడు. ఇలాంటి పనులు ప్రొఫెసర్‌గారి ముందు చెయ్యగల స్వతంత్రత ఫారిన్ తిరిగిరావటంతో పద్మనాభం సంపాదించాడు...

'ఆ ఫీల్డులో రిసర్చి డాక్టర్ రెడ్డి చేస్తున్నాడు. అందువల్ల ఆ ఫీల్డులో విద్యార్థులను అతనికే వదిలి వెయ్యటం విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా మంచిది అని నా అభిప్రాయం' అన్నారు రావుగారు.

పద్మనాభం మాట్లాడలేదు.

'ఇంతగా నీకూ అదే ఫీల్డులో యింటా

లన్నీ యితే మీరూ ఆ ఫీల్డులోనే గైడ్ చెయ్యటానికి నాకేం అభ్యంతరం లేదు. కానీ మీ డాక్టరల్ థీసిస్ మరో ఫీల్డులో గదా? ఆ ఫీల్డులోనే మీరు రిసర్చి ప్రాజెక్టులను తీసుకుంటారనుకున్నాన్నేను' అన్నారు రావుగారు.

పద్మనాభం మాట్లాడకుండా సిగరెట్టు కాలుస్తున్నాడు.

'డాక్టరేట్ తీసుకున్న తర్వాత రెడ్డిగారి ఫీల్డులో మీరేమన్నా రిసర్చి పేపర్లు పబ్లిష్ చేశారా?' అన్నారు రావుగారు మళ్లీ.


పద్మనాభం సిగరెట్టు నేలమీద పడేసి కాల్తో రాశాడు. కాలుస్తున్న సిగరెట్టు కాలి క్రిందపడి ఆరిపోయింతర్వాత అరికాలిమంట నెత్తికెక్కింది. తన పేపర్ల సంగతి సెలక్షనప్పుడే యెవ్వరూ అడగలేదు. 'ఇప్పుడు నువ్వా అడిగేది' అని ప్రొఫెసర్ మీద మండిపడ్డాడు.

'డాక్టరేట్ తీసుకున్న తర్వాత యే ఫీల్డులోనైనా రిసర్చి చేయించగల స్తోమతొస్తుం దండి ... ఆ శక్తి లేకపోతే డాక్టరేటుకు విలువే లేదు. పైగా నే తీసుకున్నది అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేటు, ఇండియాలో డాక్టరేట్ తీసుకున్న రెడ్డి ఒకే ఫీల్డుని కూర్చోవటంతప్ప యింకేం చెయ్యగలడు? నా సంగతలా కాదే! ... నేను దేంట్లోనైనా రిసర్చి చేయించగలను' అన్నాడు పద్మనాభం.

'అయామ్ సారీ డాక్టర్ పద్మనాభం! మీరు అమెరికాలో చదువుకుని కూడా యిలా మాట్లాడ్డం విచిత్రంగా వుంది. అమెరికాలో స్పెషలైజేషన్‌కు అధిక ప్రాముఖ్యత యిస్తారుగదా. ఇలా అన్ని విభాగాలు నావేనని అక్కడెవ్వరూ చెప్పుకోరు. స్పెషలైజేషన్‌కంత ప్రాముఖ్యం యివ్వబట్టే వారు ప్రతి విషయం క్షుణ్ణంగా పరిశీలించి


క్రిస్టల్
మునినవ్వుల
చమత్కారం

క్రిస్టల్‌యొక్క
మెరిసే పళ్లు
క్రిస్టల్‌యొక్క
సువాసిత ఊపిరి!



క్రిస్టల్ మునినవ్వుల ప్రతి బింబంలో ఉత్సాహ భరిత జీవనం సర్వవిదితం. దీనికి కారణం —క్రిస్టల్ యొక్క సుగుణం క్రిస్టల్ టూత్‌పేస్టు యందుగల అత్యంత గుణకరమైన పదార్థాలు దంత క్షయమును అరికట్టి-పళ్లను రోజంతా పరిశుభ్రంగాను తాజాదనంగాను వుంచుతాయి.

క్రిస్టల్
టూత్ పేస్ట్




ఎస్.ఎల్.ఎస్. డి.సి.పి. తో గూడినది.
అత్యధిక నురుగు—అత్యధిక సువాసన 2 సైజులలో లభించుచున్నది. అలెంబిక్ హౌస్ ఉత్పత్తి.
everest/360g/ACW-TL

దేవి పిల్స్ REGD

వాడండి ముఖ్యంగా అలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకు

స్త్రీలకు ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగించవు

SEALED PACKING 28 & 14 TABLETS

AVAILABLE AT ALL CHEMISTS

MFRS: SEENU & CO., MADRAS-81



ధరించడానికి తగినవస్త్రాలు?

ట్విన్ టస్కర్

డ్రిల్‌లు·పాప్లిన్‌లు·గాబర్డీన్‌లు టస్సూర్‌లు మొదలైనవి

మధుర మిల్స్

మదురై, దక్షిణ ఇండియా





దీర్ఘ రోగులకు

ఉత్తమ వైద్యము

...17.


# ఫారిన్...

పరిశోధించ గలుగుతున్నారేమోనని నేనను కుంటూ వుంటాను...మీరిట్లా మాట్లాట్టం సబబుగా లేదు' అన్నాడు ప్రొఫెసర్ రావు.

పద్మనాభం కొంచెం తగ్గాడు. నిదర్శనగా కుర్చీలో వెనక్కి వాలాడు.

'కానీ రెడ్డి చేస్తున్న విభాగానికిప్పుడు ప్రపంచంలో పెద్ద ప్రాముఖ్యం వుందని మీరే కదా చెప్పారు. రెడ్డి లెక్చరర్‌గా వుంటున్నాడు; అతగాడి కదప్పగించటం బాగుండదని నా వుద్దేశ్యం ... అలాంటి ఫీల్డులో మనలాంటి ప్రొఫెసర్లం చెయ్యాలి (పద్మనాభం అసిస్టెంటు ప్రొఫెసరైనా ప్రొఫెసర్ పద్మనాభం అని పిలిపించు కుంటూ వుంటాడు; డాక్టర్ పద్మనాభం అని యెవరన్నా పిలుస్తే పరువునష్టం దావా వేసేదా అన్నట్లు చూస్తాడు); విదేశాల్లో చదివిన మనలాంటివాళ్ళు దాంట్లో రిసర్చి చేస్తే ఆ ఫీల్డుకు స్టేటస్ కూడా వస్తుంది' అన్నాడు పద్మనాభం. ప్రొఫెసర్ రావుగారికి కోపం వచ్చింది. కానీ కోపానికి పద్మనాభానికి మధ్య ప్రొఫెసర్ గారి సభ్యత అడ్డొచ్చి వారి కోపం పద్మనాభానికి కనిపించలేదు...

ఇక్కడ డాక్టర్ రెడ్డి సంగతి కొద్దిగా చెప్పాలి. రెడ్డి యేడెనిమిదేళ్ల క్రితం యిండియాలోని పక ప్రముఖ విద్యా సంస్థలో పిహెచ్. డి. డిగ్రీ తెచ్చుకున్నాడు. ఇంతవరకూ అయిదుగురు విద్యార్థులు రెడ్డివద్ద పనిచేసి డాక్టరేట్లు తెచ్చుకున్నారు. తనదగ్గర పనిజేసే విద్యార్థుల రిసర్చి విషయాల గురించి ఆ విద్యార్థులకంటే తనే యెక్కువగా ఆలోచిస్తాడనీ, వాళ్లకంటే యెక్కువగా తనే పని చేస్తాడనీ పేరెత్తుకున్నాడు రెడ్డి. తన ఫీల్డులో విదేశాల్నుంచొచ్చే ప్రముఖ జర్నల్స్‌లో పేపర్లు ప్రచురించాడు. అతని పేర్లు విదేశాలు వెళ్లి నిలబడ్డాయ్ గానీ యితగాడు మాత్రం విదేశాలు వెళ్లలేదు. అందుకే లెక్చరర్‌గానే వుంటున్నాడు. లెక్చరర్‌గా చేరిన రెండేళ్లనుంచి డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు ప్రకటన పడ్డప్పుడల్లా దరఖాస్తు పడేశాడు ఇంతవరకూ మూడు నాలుగు తడవలు యింటర్వ్యూకూడా వెళ్లాడు; కానీ యింటర్వ్యూలో—

'ముద్ర వేసుకున్నావా?' అడిగేవాళ్ళు.

రెడ్డి వేసుకున్న కోటుమీద ఫారిన్ రిటర్న్‌డ ముద్రలేదు. కోటు వెనకాలేమన్నా వేయించుకున్నాడేమోనని—

'మీరిప్పుడు చేస్తున్న రిసర్చి ప్రాబ్లెం గురించి బోర్డుమీద రాసి చెప్పండి' అని బోర్డుదగ్గరకు పంపించే వాళ్ళు. అలా బోర్డు దగ్గరకు వెళ్లేటప్పుడు కోటు వెనక భాగంమీద 'ముద్ర' వుంటే బోర్డు దగ్గర వో అయిదు నిముషాలు నిలబెట్టి మళ్లీ కుర్చీలో కూర్చోబెట్టి ఆ పోస్టు కట్టబెడతారు. 'ముద్ర' లేదని తెల్సుకుంటే బోర్డుదగ్గరే వో గంట నిలబెట్టి చివరకు 'అడిగేవాడికి చెప్పేవాడు లోకువ' అన్న సూత్రాన్ని పూర్తిగా వుపయోగించుకుని బయటకు పంపిస్తారు. రెడ్డికీ యిలాగే జరిగింది. రెడ్డి యింటర్వ్యూకు వెళ్ళినప్పుడల్లా యిలా 'ముద్ర' వేసుకున్న అభ్యర్థులు కనీసం యిద్దరు ముగ్గురైనా వచ్చేవాళ్ళు. వాళ్ళు యింటర్వ్యూలకు రాకపోయినా వాళ్ల దరఖాస్తులను చూసి వాళ్లని లాక్కొచ్చేవాళ్ళు. క్రిందటిసారి రెడ్డి యింటర్వ్యూకు వెళ్లినప్పుడు పద్మనాభం దరఖాస్తు యింటర్వ్యూకొచ్చింది. పద్మనాభం వచ్చిచేరబోతున్నాడన్న చాటింపు డిపార్టుమెంట్‌లో వేశారు మిగతా ఫారిన్ రిటర్న్‌డ వాళ్ళు. 'అమెరికాలోని ఫలానా యూనివర్శిటీ నుంచి మన డిపార్టుమెంటు కొస్తున్నాడాయన' అంటూ దండోరా వేసేవాళ్ళు రోజూ. డిపార్టుమెంట్‌లోని మిగతా వాళ్లందరూ 'ఎవ్వరో యీ మహానుభావుడ' ని కనిపెట్టుకుని కట్టకట్టుకుని కూర్చుంటారు. (పూర్వపు రోజుల్లో రాజకుమార్తె చేత కత్తికి కంకణం కట్టించి పెళ్లిళ్ళు చేసేవార్ట. పెళ్ళయ్యాక వెళ్లిచూస్తే భర్త మూడేళ్ల పిల్లవాడనో, లేదా మంచంలోంచి లేవలేని శావ్రగస్తుడనో తెల్సుకునేది రాకుమార్తె. ఇలాంటి కథలు విన్న మిగతా రాకుమార్తెలు యిలాంటి పెళ్లిళ్ళు చేసుకోవటం జరిగితే భర్తలాంటివాడా అని ఆదుర్దాలో యెదురుచూస్తూ వుండేవారు. డిపార్టుమెంటులోని మిగతావాళ్ళు కూడా ఫారిన్ రిటర్న్‌డ కోసం అంత ఆదుర్దాగాను యెదు

చూసేవారు!

పద్మనాభం వచ్చిన పదిరోజులకు రెడ్డి పద్మనాభాన్ని కలిశాడు.

'మీరు ఫలానా యూనివర్సిటీ నుంచా రావటం?' అన్నాడు రెడ్డి.

'య్యా' అన్నాడు పద్మనాభం; ఆ యూనివర్సిటీ హిస్టరీ, జాగ్రఫీ రెండూ చెప్పాడు. కానీ రెడ్డికక్కడ జరిగే రిసర్చి విషయాలు కావాలి.

'ఫలానా జర్నలు ఆ యూనివర్సిటీ నుంచే వస్తోంది' అన్నాడు రెడ్డి.

'ఐథింక్ సో' అన్నాడు పద్మనాభం.

'మీరేమన్నా ఆ జర్నల్‌లో ప్రచురించారా?' అన్నాడు రెడ్డి.

'ఎక్కడండి? తీరికేది? అక్కడ డాక్టరల్ ప్రోగ్రాం అంటే ఇండియాలో మాదిరి ఆషామాషీ గాదు. వచ్చేంత పని... పేపర్ పబ్లికేషన్‌కు టైం దొరకదు' అన్నాడు పద్మనాభం.

'అయినా ప్రతి థీసిస్‌లోంచి కనీసం రెండు మూడు పేపర్లన్నా వస్తాయ్ గదా... అవి పబ్లిష్ చెయ్యకపోయ్యారు' అన్నాడు రెడ్డి.

రెడ్డి చెప్పింది కరెక్టే. అయినా పద్మనాభం అమెరికా వెళ్ళి ఇండియాలోని తన రాష్ట్రంలోని తన జిల్లా వ్యవహారాలమీద యేదో 'డిస్క్రిప్టివ్' పద్ధతిలో వ్రాశాడు. థీరిటికల్ ప్రిన్సిపుల్సుగానీ, ఎనలిటికల్ పద్ధతిగానీ దాంట్లోలేదు. ఇలాంటి వాటికి ప్రముఖ విదేశీ జర్నల్సులో ప్రవేశం వుండదు. అయినా పద్మనాభం తన థీసిస్‌లోని ఆరు చాప్టర్లలోంచి ఆరు పేపర్లు రాసి అమెరికాలోని జర్నల్సుకు అమెరికా నుంచే పంపాడు.

'ఈ పేపరు మీ దేశం అంతటిలోనూ మీ రాష్ట్రంలోని మీ జిల్లాకు యెంతో వుపయోగం. అందువల్ల మీ జిల్లానుంచొచ్చే జర్నల్లో ప్రచురిస్తే యెంతో నయం. ఇండియాకు వెళ్ళాక ఆపని తప్పక చెయ్యగలరని ఆశిస్తున్నాం' అంటూ రాసిన వుత్తరాలతో తిరిగొచ్చినయ్ పేపర్లు.

పద్మనాభం చదివిన యూనివర్సిటీ నుంచొచ్చే జర్నల్‌లో రెడ్డి అయిదారు పేపర్లు ప్రచురించాడు. తన పేపర్లలో అంతవరకూ చలామణి అవుతున్న కొన్ని సిద్ధాంతాల్ని రెడ్డి ఖండించాడు. ప్రొఫెసర్ మిల్లర్ అనే ఆయన సిద్ధాంతంమీద వ్యాఖ్యానించాడు ఒక పేపర్లో. ఆ విషయం మాట్లాడుతో —


'ప్రొఫెసర్ మిల్లర్ 1966 లో ప్రతిపాదించిన సిద్ధాంతంమీద మీ వుద్దేశ్యమేమిటి?' అంటూ పద్మనాభాన్నడిగాడు.

'ఓ ప్రొఫెసర్ మిల్లర్ కదూ!... య్యా... ఆయన మాకు క్లాసులు తీసుకునేవాడు... బాగా చెబుతాడు.... ఒకసారి క్లాసులో నేనో ప్రశ్న వేశాను...' అంటూ చెప్పుకుపోతున్న పద్మనాభాన్ని ఆపి—

'అది కాదండీ... ఆయన సిద్ధాంతాల మీద మీ అభిప్రాయం యేమిటి?' అన్నాడు రెడ్డి.

'అదే చెప్పబోతున్నాను... ఆ సిద్ధాంతాల గురించి మా కెప్పుడూ క్లాసులో చెప్పలేదే ఆయన' అన్నాడు పద్మనాభం.

పద్మనాభం క్లాసుల్లో చెప్పింది తప్ప జర్నల్సుచూసి తెలుసుకుంది తక్కువ. కొన్ని ప్రధాన విషయాలు 'కోర్సువర్కు'తో చెప్పి మిగతావి విద్యార్థి తనంత తాను తెల్సుకునేందుగ్గాను వదలివేస్తారు. రిసర్చి పట్ల వ్యాసక్తలకున్న అభిరుచిని తెల్సుకునేందుగ్గాను యీ పద్ధతి వుపయోగ



గిస్తారు. విద్యార్థి 'ప్రాబ్లెం' యెన్నుకున్న తర్వాత ఆ 'ప్రాబ్లెం' యొక్క స్వభావాన్నిబట్టి విద్యార్థి శక్తి తెల్సుకుని అట్లాగే అతగాడి వర్కు కానిచ్చి డిగ్రీయిచ్చి పంపిస్తారు. ఇంతవరకూ అనేక థీసిస్‌లకు పిహెచ్.డి డిగ్రీ లొచ్చినయ్. పిహెచ్.డి డిగ్రీవచ్చిన ప్రతి థీసిస్ వున్నతమైనది కానక్కర్లేదు. కొన్ని దేశాలలో అక్కడకొచ్చే విదేశీ విద్యార్థులపట్ల కొంత సానుభూతి వుంటుంది. ఈ సానుభూతికి కారణాలనేకం. అందులో వకటి— మన దేశం (అంటే ఆ విదేశం)లో పనిచేసే వాళ్లకి చాలా సామర్థ్యం కావాలి. 'మన ఆర్థిక వ్యవస్థ అట్లాంటిది. కానీ ప్రపంచంలోని కొన్నిదేశాలలో మనకు కావల్సినంత సామర్థ్యం లక్కర్లేదు. అందువల్ల అలాంటి దేశాలనుంచి వచ్చే విద్యార్థులకు డిగ్రీ లిచ్చేటప్పుడు మన విద్యార్థులనుంచి ఆశించినంత సామర్థ్యం ఆశించకండి; వాళ్ల ఆర్థిక వ్యవస్థ వేరు, వాళ్లని అవస్థపెట్టకండి' అన్న ధోరణి అని కొందరంటారు. అందరూ యిలాంటి డిగ్రీలెత్తుకుంటున్నారని చెప్పటం

# ఫారిన్ ...

వుద్దేశ్యం కాదు. ఇలాంటివాళ్లు కొందరుంటారు. ఇలాంటివారిలో పద్మనాభం వకడు. అయినా వుద్యోగవ్యవహారాల్లో మాత్రం మిగతా ఫారిన్ రిటర్న్డ వ్యక్తుల మాదిరే వున్నాడు.

అసలు పద్మనాభం ఫారిన్ వెళ్లటంలో వుద్దేశ్యమే ముద్రవేసుకొద్దామని.

'పోస్టుగ్రాడ్యుయేటు వయ్యావుగదా! ఎటువేపుకన్నావెళ్లి వో ముద్దరేసుకొస్తే సరిపోతుందింక... ప్రయత్నించు' అన్నారు పద్మనాభం మిత్రులు.

యు. ఎస్.ఏ వెళ్లిందగ్గర్నుంచి 'ముద్దరెక్కడ వేస్తారా' అని అన్వేషణ మొదలెట్టాడు పద్మనాభం. కానీ యెక్కడా కనిపించలేదది. తను యిండియాకు రావాల్సిన సమయం దగ్గర పడుతున్నకొద్దీ పద్మనాభానికాదుర్దా యెక్కువ కాసాగింది. కొందరు మిత్రులు వీడ్కోలు పార్టీ యిస్తూండగా పద్మనాభం బావురుమన్నాడు. ఇక్కడకొచ్చినపని జరగలేదన్నాడు.

మిత్రులందరూ 'యేమిటేమిట'న్నారు. పద్మనాభం గోడు విన్నారు; గోడకు చేరగిలమన్నారు.

'మీరొచ్చేటప్పుడు పేపర్లలో 'పై చదువులకు పై దేశాలకు ప్రయాణం' అని రాయించుకోకుండా వచ్చేశారా?' అన్నారు మిత్రులు.

'అవున' న్నాడు పద్మనాభం.

'అదీ మీర్చేసిన పొరపాటు. ఫారిన్ రిటర్న్డ ముద్ర యిండియాలోనే కొడతారు. ఇండియా నుంచి బయటకొచ్చేటప్పుడొక తడవ పేపర్లో, మళ్లీ తిరిగొచ్చేటప్పుడు మరోతడవ పేపర్లలో కొట్టించుకుంటారు. ఈ రెండు పనులూ చేయించుకుంటే యీ ఫారిన్ రిటర్న్డ ముద్ర పడుతుంది' అన్నారు మిత్రులు.

'నేనొచ్చేటప్పుడు పేపర్లలో ఫోటో వేయించుకోలేదు కాబట్టి నాకిప్పుడు ఫారిన్ రిటర్న్డ ముద్దరపడదా' అన్నాడు దిగులుగా పద్మనాభం.

'అంతే మరి' అన్నారు మిత్రులు విచారంగా.

పద్మనాభం తల వేలాడేశాడు.

ఇంతలో వకమిత్రుడికో ఆలోచనొచ్చింది. అందరి జేబుల్లోంచి డబ్బులీసుకుని బజారెళ్లి తిరిగొచ్చాడు. ఓ ప్యాకెట్టు తీసుకొచ్చాడు.

'నువ్వు బొంబాయిలో ప్లేన్ దిగంగానే యీ ప్యాకెట్టు విప్పు...యీ లోగా విప్పకు ... విప్పావంటే ఫారిన్ రిటర్న్డ ముద్దర ఆశ వదులుకోవాల్సిందే' నన్నారు.

పద్మనాభం భద్రంగా ఆ ప్యాకెట్టు బొంబాయిలో ప్లేన్ దిగంగానే విప్పదీశాడు. దాంట్లో వో కోటుంది. కోటుకు ముందూ వెనకాల 'ఫారిన్ రిటర్న్డ' అన్న ముద్దర్లున్నయ్. ఫారిన్‌వెళ్లిన ఆనందం బొంబాయి తిరిగొచ్చాగ్గాని రాలేదు పద్మనాభానికి;

ఇంటికి చేరాక చుట్టాలూ, పక్కాలూ, పక్కవాళ్లూ — మొత్తానికి సాధించావ్ ... ముద్దరేసుకొచ్చావ్; చాలీ జీవితానికి; యింక చాలీచాలని జీతాల్తో బాధపడక్కర్లేదు' అన్నారు.

'మిగతా గ్రహాలమీద యూనివర్సిటీలొచ్చేంతవరకూ ఫర్వాలేదు. అప్పడ్దాకా ఈ ముద్దర్తో కొట్టుకుంటూ, నెట్టుకుంటూ పోవచ్చు' అనుకుంటూనే ఈ డిపార్టుమెంట్‌లో చేరాడు.

* * *

పద్మనాభం యిండియాకు తిరిగొచ్చి అయిదారేళ్లయ్యింది. ఫారిన్ రిటర్న్డ ముద్దర లక్షయపాత్రమాదిరి అన్నీ ప్రసాదిస్తూనే వున్న దింతవరకూ. పద్మనాభం సీనియర్ ప్రొఫెసరయ్యాడు. ఇప్పటికీ నిద్రలో లేపి అడిగినా ఈ క్రిందిసలహా యిస్తూంటాడు:

'ఎటో అటు పోయి వో ముద్దరేసుకురండి; ఆ తర్వాత నిద్దరోయినా కావల్సినవన్నీ మీ దగ్గరకొస్తూ వుంటయ్'

(అయిపోయింది)

**అంకితం:** ఆదర్శ అధ్యాపకునిగా అందరి అభిమానాన్ని, అనేక గౌరవాల్ని అందుకున్న హిందూ కాలేజి (గుంటూరు) మాజీ ప్రధానోపాధ్యాయులు కీ. శే. వల్లభజోశ్యుల సుబ్బారావుగారిని స్మరిస్తూ—

విజ్ఞానాన్ని సంపాదిస్తూ, దాన్ని పెంపొందిస్తున్న విజ్ఞులందరకూ (ఫారిన్ వెళ్లయినా, వెళకుండానయినా) ఈ కథలను అంకితం చేస్తున్నాను—

—రచయిత.

